విశాఖపట్టణం
శుక్రవారం 5 జూన్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:132 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## ఏపీ చరిత్రలో చిరస్థాయిగా
# జూన్ 4వ తేదీ
## నిలిచిపోతుంది: చంద్రబాబు

ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు సందర్భంగా చంద్రబాబు భావోద్వేగం

రాష్ట్ర వికాసం కోసం ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చిన రోజు అన్న చంద్రబాబు

రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యతను తమ భుజాలపై పెట్టారని వ్యాఖ్య

2



## చంద్రబాబు అధ్యక్షతన
# ఎన్డీయే సమావేశం

హాజరైన పవన్ కల్యాణ్, మాధవ్

ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో

ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశం

హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

రెండేళ్ల కూటమి ప్రభుత్వ విజయాలపై వేడుకలకు సన్నాహాలు

కార్యక్రమాల కార్యాచరణపై నేతల మధ్య కీలక చర్చ

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై భాగస్వామ్య పక్షాల నేతలు దృష్టి సారించారు. గురువారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో కీలక నేతలు సమావేశమై దీనిపై చర్చించారు. ఈ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో సాధించిన విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలనే దానిపై నేతలు ప్రధానంగా చర్చించారు. వేడుకల నిర్వహణకు సంబంధించిన కార్యాచరణ, భవిష్యత్ ప్రణాళికలపై సుదీర్ఘంగా సమాలోచనలు ..మిగతా 2లో

## 'అమరావతి ఐ' సహా కీలక ప్రతిపాదనలకు
# గ్రీన్ సిగ్నల్

సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం

లండన్ ఐ తరహాలో అమరావతిలో 'అమరావతి ఐ' నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 125 రోజులకు పెంచుతూ కీలక నిర్ణయం

రాష్ట్రానికి కొత్త విమానయాన పాలసీ, పర్యాటకాన్ని పెంచేలా బీచ్ షాక్‌ల ఏర్పాటు

అగ్రిగోల్డ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టుకు సిబ్బంది నియామకం, సబ్ కమిటీ ఏర్పాటు

పోలవరం ఎడమ కాలువకు సవరించిన అంచనాలు, పలు పారిశ్రామిక ప్రాజెక్టులకు భూకేటాయింపులు



ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేసే పలు చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే 'అమరావతి ఐ' ప్రాజెక్టు నుంచి గ్రామీణ పేదల బతుకులకు భరోసా ఇచ్చే కొత్త ఉపాధి హామీ పథకం వరకు దాదాపు 35కు పైగా కీలక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి ఆమోదముద్ర వేసింది. సమావేశం అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను సమగ్రంగా వివరించారు.

**అమరావతికి ఐకానిక్‌గా 'అమరావతి ఐ'**

లండన్, దుబాయ్ నగరాల్లోని ..మిగతా 2లో

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు..

ప్రాంతీయ పార్టీలతో కేంద్రం రహస్య సంప్రదింపులు!

డీలిమిటేషన్ బిల్లుపై కేంద్రం

మరోసారి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం

2029 ఎన్నికల లోపే పూర్తి చేయాలని యోచన

ప్రాంతీయ పార్టీలతో కేంద్రం సంప్రదింపులు

గతంలోని వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని ఆచితూచి అడుగులు

ఏకాభిప్రాయం కోసం ముందస్తు చర్చలు



ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

నియోజకవర్గాల పునర్విభజన బిల్లును మరోసారి తెచ్చే యోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికల కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి కసరత్తు చేస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే ఇది సున్నితమైన అంశం కావడంతో ఎలాంటి వివాదాలకు తావులేకుండా ..మిగతా 2లో

# టీఎంసీలో తీవ్ర సంక్షోభం

మమతకు భారీ షాక్

బీజేపీ వైపు 20 మంది టీఎంసీ ఎంపీల చూపు!


ప్రతిపక్ష నేతగా రెబల్ ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీకి గుర్తింపు

బీజేపీతో టచ్‌లో 20 మంది టీఎంసీ ఎంపీలు ఉన్నట్లు ఊహాగానాలు



ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ చరిత్రలోనే అతిపెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మొదలైన అసమ్మతి, ఇప్పుడు ఎమ్మెల్యేల తిరుగుబాటుతో తీవ్రస్థాయికి చేరింది. ఈ సంక్షోభం రాష్ట్రానికే పరిమితం కాకుండా, ఢిల్లీకి కూడా పాకింది. ఏకంగా 20 మంది లోక్‌సభ సభ్యులు పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు మమతా బెనర్జీకి ..మిగతా 2లో



## పర్యావరణ పరిరక్షణకు
# సైకిల్ వినియోగం

ప్రజలకు చంద్రబాబు విజ్ఞప్తి

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు సైకిల్ వినియోగించాలని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగే ..మిగతా 2లో

## దేశంలో తొలి ఫ్లెక్స్-ఫ్యూయల్
# కారు ఆవిష్కరణ

మారుతి సుజుకి కీలక ముందడుగు...

మారుతి సుజుకి నుంచి దేశంలోనే తొలి ఫ్లెక్స్-ఫ్యూయల్ కారు ఆవిష్కరణ

100 శాతం ఇథనాల్‌తో నడిచేలా వ్యాగన్‌ఆర్ కొత్త మోడల్ రూపకల్పన

పాత వాహనాలను ఫ్లెక్స్-ఫ్యూయల్‌గా మార్చాలని కంపెనీలకు గడ్కరీ సూచన

డీజిల్‌లో 15% ఐసోబ్యుటనాల్ కలిపే యోచనలో ఉన్నామన్న కేంద్ర మంత్రి

కంప్రెస్డ్ బయోగ్యాస్, హైడ్రోజన్‌పైనా దృష్టి సారించామన్న మారుతి సుజుకి




2




విలేకరులు కావలెను

NEWS

'జయజయహే' తెలుగు దినపత్రికకు తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని క్రింది మండలాల్లో వార్తలు సేకరించడానికి ఉత్సాహం, నిబద్ధత కలిగిన విలేకరులు (Reporters) కావలెను.

జయ జయహే తెలుగు దినపత్రిక


ఖాళీలు ఉన్న మండలాలు :

- రాజమహేంద్రవరం రూరల్
- కొవ్వూరు
- తాళ్లపూడి
- చాగల్లు
- పెరవలి
- ఉండ్రాజవరం
- నల్లజర్ల
- గోపాలపురం
- రాజానగరం
- మండపేట
- అనపర్తి

గమనిక : పత్రిక రంగంలో అనుభవం ఉన్నవారికి లేదా వార్తలు రాయడంపై ఆసక్తి ఉన్న యువతీ యువకులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

మరిన్ని వివరాలకు సంప్రదించండి : బి. సంగీతరావు
ఫోన్ నెంబర్ : 63029 25657

## 'అమరావతి ఐ' సహా కీలక ప్రతిపాదనలకు
# గ్రీన్ సిగ్నల్



మొదటి పేజీ తరువాయి...

ఐకానిక్ నిర్మాణాల తరహాలో, కృష్ణా నది ఒడ్డున ఆరు ఎకరాల విస్తీర్ణంలో 'అమరావతి ఐ' నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (ఐడీఖీూ) పద్ధతిలో 30 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. దీనికోసం టెండర్లు ఆహ్వానించేందుకు మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా అమరావతి, కృష్ణా నది అందాలను పర్యాటకులు వీక్షించేందుకు వీలు కలుగుతుందని, ఇది ప్రపంచ పర్యాటక పటంలో అమరావతికి ప్రత్యేక స్థానం కల్పిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

**రాజధాని నిర్మాణ పనులకు ఊతం**

అమరావతిలో నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా కేబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది. హైకోర్టు భవనం బాహ్య సుందరీకరణ పనుల కోసం రూ. 547 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అదేవిధంగా, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, ప్రిన్సిపల్ సెక్రటరీల నివాస భవనాల్లో హోమ్ ఆటోమేషన్, ఇతర ఆధునిక సౌకర్యాల కల్పన కోసం రూ. 94.90 కోట్ల పనులకు ఆమోదం తెలిపింది. రాజధానిలో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం ఏపీఐఐసీకి ఎనిమిది ఎకరాల భూమి కేటాయింపును నిర్ధారించారు. రానున్న 9-10 నెలల్లో దీని నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**గ్రామీణ ఉపాధికి 125 రోజుల గ్యారెంటీ**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్' (ఎదీ+-=ూహీూజీ×) పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. జూలై 1, 2026 నుంచి ఈ పథకం అమలులోకి వస్తుంది. దీని కింద ప్రస్తుతం ఉన్న 100 రోజుల ఉపాధి హామీని 125 రోజులకు పెంచారు. దీనివల్ల ప్రతి గ్రామీణ కుటుంబానికి అదనంగా ఏటా రూ. 7,675 లబ్ధి చేకూరుతుంది. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తాయి. అంతేకాకుండా, కూలీలకు 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలని, ఆలస్యమైతే రోజుకు 0.05% చొప్పున వడ్డీ చెల్లించాలని నిబంధన విధించడం గమనార్హం.

**కొత్త పాలసీలతో ప్రగతి పథం**

విమానయాన పాలసీ: రాష్ట్ర విమానయాన రంగంలో భారీ లక్ష్యాలతో కొత్త పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. 2035 నాటికి ప్యాసింజర్ మార్కెట్ షేర్‌ను 4 శాతానికి, ఎయిర్ కార్గో మార్కెట్ షేర్‌ను 5 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొత్త విమానాశ్రయాలు, వాటర్ డ్రోమ్‌ల ఏర్పాటు, ఏరోస్పేస్ తయారీలో పెట్టుబడులను ఆకర్షించడం ఈ పాలసీ ముఖ్య ఉద్దేశాలు.

బీచ్ షాక్ పాలసీ: రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు గోవా, ఒరిస్సా తరహాలో బీచ్ షాక్‌ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పైలట్ ప్రాజెక్ట్‌గా తొలి దశలో చీరాలలోని సూర్యలంక, విశాఖపట్నం బీచ్‌లలో రెండేసి చొప్పున షాక్‌లను ఏర్పాటు చేస్తారు.

అవయవదాన చట్టం: అవయవదానం, అవయవ మార్పిడి కార్యకలాపాలను నియంత్రించేందుకు కేంద్రం తీసుకొచ్చిన 'ది ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్-2011'ను రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ నిర్ణయించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, అవయవాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ చట్టాన్ని ఆర్డినెన్స్ రూపంలో తీసుకురానున్నారు.

**వ్యవసాయం, పరిశ్రమలకు చేయూత**

పోలవరం ఎడమ ప్రధాన కాలువ ప్యాకేజీ 5, 5ూ పనులకు సంబంధించి అంచనా వ్యయాన్ని రూ. 352.6 కోట్ల నుంచి రూ. 796.66 కోట్లకు సవరిస్తూ కేబినెట్ పరిపాలన అనుమతులు ఇచ్చింది. అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టుకు 21 పోస్టులను మంజూరు చేసింది. ఈ కేసుల పరిష్కారానికి మంత్రులతో ఒక సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం నెడ్‌క్యాప్ ద్వారా పలు కంపెనీలకు భూములు లీజుకు ఇచ్చే ప్రతిపాదనలకు కూడా ఆమోదం లభించింది.

**ఇతర కీలక నిర్ణయాలు**

శ్రీ సిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ: తిరుపతి జిల్లా శ్రీ సిటీలో కొత్త ప్రైవేట్ యూనివర్సిటీ ఏర్పాటుకు వీలుగా ఏపీ ప్రైవేట్ యూనివర్సిటీ యాక్ట్-2016 సవరణకు ఆర్డినెన్స్ జారీకి ఆమోదం.

అంతర్జాతీయ యోగా దినోత్సవం: జూన్ 7 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు రూ.10 కోట్లు మంజూరు.

భూముల రీ-క్లాసిఫికేషన్: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు గ్రామంలోని 25 ఎకరాల 'ట్యాంక్ పోరంబోకు' భూమిని 'గ్రామ కంఠం'గా మార్చేందుకు నిర్ణయం. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.

టీడీపీ కార్యాలయాలకు భూమి: అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో తెలుగుదేశం పార్టీ కార్యాలయాల నిర్మాణానికి 66 ఏళ్ల లీజు ప్రాతిపదికన భూమి కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం రాజధాని అమరావతి నిర్మాణాన్ని పరుగులు పెట్టించడం, పర్యాటక రంగానికి కొత్త ఊపునివ్వడం, గ్రామీణ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడం, పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయడం వంటి బహుముఖ లక్ష్యాలతో సాగింది. ఈ నిర్ణయాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రగతిపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.

## చంద్రబాబు అధ్యక్షతన
# ఎన్డీయే సమావేశం

మొదటి పేజీ తరువాయి...

జరిపారు. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించేలా కార్యక్రమాలు ఉండాలని ఈ సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కూడా పాల్గొన్నారు. భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయంతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని నేతలు నిర్ణయించినట్టు సమాచారం.

# టీఎంసీలో తీవ్ర సంక్షోభం

మొదటి పేజీ తరువాయి...

కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. జూన్ 3న, పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీని ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ గుర్తించారు. తమకు 58 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని రెబల్ వర్గం ప్రకటించింది. దీంతో అసెంబ్లీలో మమతా బెనర్జీ వర్గం బలహీనపడింది. మొత్తం 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేలలో అధికశాతం మంది రెబల్ వర్గం వైపు ఉన్నారు. ఏప్రిల్-మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరపడిన తర్వాత ఈ సంక్షోభం మొదలైంది. ప్రతిపక్ష నేత ఎంపిక విషయంలో పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని రెబల్ ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ వ్యవహార శైలి, ఎన్నికల ఓటమి తర్వాత ఆయన పెత్తనం చెలాయించడమే ఈ తిరుగుబాటుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. తామంతా మమతా బెనర్జీ నాయకత్వాన్ని గౌరవిస్తామని, కానీ అభిషేక్ పెత్తనాన్ని సహించబోమని రెబల్ ఎమ్మెల్యేలు స్పష్టం చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో, సుమారు 20 మంది టీఎంసీ ఎంపీలు బీజేపీ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇది నిజమైతే, పార్లమెంటులో మమతా బెనర్జీ బలం మరింత క్షీణిస్తుంది. ఇటీవల మమత నిర్వహించిన నిరసన కార్యక్రమానికి కేవలం ఆరుగురు ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు మాత్రమే హాజరుకావడం ఆమె చుట్టూ విధేయుల సంఖ్య తగ్గుతోందనడానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఈ తిరుగుబాటు నేపథ్యంలో టీఎంసీ బెంగాల్‌లోని అన్ని కమిటీలను రద్దు చేసి, ఆత్మపరిశీలన చేసుకుంటామని ప్రకటించింది.

## ప్రతిపక్షాల సమావేశానికి
# డీఎంకే దూరం
## 'ఇండి కూటమి'ని వీడుతోందా?

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

తమిళనాడులో కాంగ్రెస్, టీవీకే పొత్తుతో రగులుతున్న విభేదాలు- కూటమి భేటీకి డీఎంకే దూరంగా ఉండనున్నట్టు సమాచారం దిల్లీ వేదికగా జూన్ 8న జరగనున్న 'ఇండి' కూటమి భేటీకి డీఎంకే దూరంగా ఉండనుంది. ప్రతిపక్షాల ఐక్యతను చాటేందుకు ఇండి కూటమి నేతలు జూన్ 8న దేశ రాజధానిలో సమావేశం కానున్నారు. అయితే, తమిళనాడులో ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీతో డీఎంకేకు సంబంధాలు క్షీణించాయి. ఫలితంగా ఈ భేటీకి డీఎంకే నేతలు దూరంగా ఉండనున్నారు. ఈ సమావేశంలో సుమారు 17 ప్రతిపక్ష పార్టీలు పాల్గొనే అవకాశం ఉంది. ఈ భేటీలో చట్టసభల లోపల, బయట అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ విజయ్ నేతృత్వంలోని టీవీకేతో చేతులు కలపడం డీఎంకేకు ఆగ్రహం తెప్పించింది. ఇరు పార్టీల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలోనే ఇండి కూటమి భేటీకి, డీఎంకే గైర్హాజరు కావడం ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు కూటమితో అంటీముట్టనట్లు వ్యవహరిస్తూ వచ్చిన టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఈ సమావేశానికి హాజరవుతారని సమాచారం. ఆమెతో పాటు ఇటీవల దాడికి గురైన టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొనే అవకాశం ఉంది. వీరితో పాటు పలు రాష్ట్రాల సీఎంలు, సీనియర్ నేతలు సమావేశానికి హాజరుకానున్నారు.




## దేశంలో తొలి ఫ్లెక్స్-ఫ్యూయల్
# కారు ఆవిష్కరణ

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

దేశంలో ప్రత్యామ్నాయ, స్వచ్ఛమైన ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా వాహన తయారీ దిగ్గజం మారుతి సుజుకి కీలక ముందడుగు వేసింది. దేశపు తొలి ఫ్లెక్స్-ఫ్యూయల్ ప్యాసింజర్ కారు 'వ్యాగన్‌ఆర్ ఫ్లెక్స్-ఫ్యూయల్' ప్రోటోటైప్‌ను గురువారం ఆవిష్కరించింది. ఈ కొత్త మోడల్ ఱ20 (20 శాతం ఇథనాల్) నుంచి ఱ100 (100 శాతం ఇథనాల్) వరకు ఎలాంటి ఇథనాల్-పెట్రోల్ మిశ్రమంతోనైనా నడిచే సామర్థ్యం కలిగి ఉండటం విశేషం.

పెట్రోల్‌పై ఆధారపడటాన్ని తగ్గించి, జీవ ఇంధనాల వాడకాన్ని పెంచాలన్న భారత ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఈ కారును అభివృద్ధి చేసినట్లు కంపెనీ తెలిపింది. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యామ్నాయ ఇంధన వ్యూహంలో భాగంగా డీజిల్‌లో 15 శాతం ఐసోబ్యూటనాల్‌ను కలిపే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని వెల్లడించారు.

పాత వాహనాలను యూరో 6 ప్రమాణాలకు అనుగుణంగా ఫ్లెక్స్-ఫ్యూయల్ వెహికల్స్‌గా మార్చేందుకు కృషి చేయాలని మారుతి సుజుకి, హీరో మోటోకార్ప్ వంటి సంస్థలను గడ్కరీ కోరారు. ఈ చర్యలతో వాయు కాలుష్యాన్ని నియంత్రించవచ్చని, వెహికల్ స్క్రాపేజ్ కార్యక్రమానికి మద్దతు లభిస్తుందని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థకు ఆటోమొబైల్ రంగం కీలక చోదకశక్తి అని, ప్రస్తుతం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆటో పరిశ్రమగా భారత్ నిలిచిందని ప్రశంసించారు.

మారుతి సుజుకి ఎండీ, సీఈఓ హిసాషి టేకూచి మాట్లాడుతూ, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ), హైడ్రోజన్ వంటి ఇతర క్లీన్ టెక్నాలజీలపై కూడా తాము దృష్టి సారించామని వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో దేశంలో అమ్ముడైన మొత్తం గ్రీన్ వెహికల్స్‌లో దాదాపు సగం మారుతి సుజుకివేనని కంపెనీ మార్కెటింగ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు.

ప్రస్తుతం ఈ కారును సాధారణ వినియోగదారులకు కాకుండా, కేవలం ఓలా, ఉబర్ వంటి ఫ్లీట్ ఆపరేటర్లు, ఇతర కమర్షియల్ అవసరాల కోసం మాత్రమే అందుబాటులోకి తెచ్చారు. ఈ కొత్త వ్యాగన్‌ఆర్‌లో 1.2-లీటర్, 4-సిలిండర్ ఖ12చీ ఇంజిన్‌ను ఉపయోగించారు. అధిక ఇథనాల్ వాడకానికి అనువుగా ఉండేలా ఇంజిన్‌లో ప్రత్యేక మార్పులు చేశారు. అయితే, వాహనం పవర్, మైలేజ్ వివరాలను కంపెనీ ఇంకా అధికారికంగా వెల్లడించలేదు.

ఈ కొత్త మోడల్ ధరను ఇంకా ప్రకటించనప్పటికీ, సాధారణ పెట్రోల్ వేరియంట్ కంటే కాస్త ఎక్కువగా ఉండవచ్చని భావిస్తున్నారు. కారు వెనుక భాగంలో 'ఫ్లెక్స్ ఫ్యూయల్' బ్యాడ్జ్‌ను అమర్చడం మినహా డిజైన్‌లో పెద్దగా మార్పులు లేవు.

## ఏపీ చరిత్రలో చిరస్థాయిగా
# జూన్ 4వ తేదీ
## నిలిచిపోతుంది: చంద్రబాబు

**ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు సందర్భంగా చంద్రబాబు భావోద్వేగం**

**రాష్ట్ర వికాసం కోసం ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చిన రోజు అన్న చంద్రబాబు**

**రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యతను తమ భుజాలపై పెట్టారని వ్యాఖ్య**

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలన విజయాన్ని నమోదు చేసి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి పునాది పడిన రోజును గుర్తుచేసుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగ పోస్ట్ పెట్టారు. 2024 జూన్ 4వ తేదీ (ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు) ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో ఐదేళ్లుగా సాగిన విధ్వంసకాండకు పూర్తిగా స్వస్తి పలికి.. రాష్ట్రాన్ని మళ్లీ వికాసం వైపు, ప్రగతి వైపు నడిపించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎంతో స్పష్టమైన తీర్పునిచ్చిన రోజు ఇదని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు ఒక కీలక సందేశాన్ని ఇచ్చారు. ప్రజలు తమకు అప్పగించింది కేవలం 'అధికారాన్ని' కాదని.. కోలుకోలేని స్థితికి చేరిన రాష్ట్రాన్ని మళ్లీ పునర్నిర్మించే ఒక 'గొప్ప బాధ్యతను' తమ భుజాలపై పెట్టారని ఆయన వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం ప్రతిక్షణం ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకే పనిచేస్తుందని సీఎం స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు ప్రధాన లక్ష్యాలతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. సమాజంలో ఎలాంటి అసమానతలు లేని వాతావరణాన్ని నిర్మించడం, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే తమ అల్టిమేట్ గోల్ అని తేల్చి చెప్పారు. రాష్ట్రాన్ని అటు ఆరోగ్యంగా, ఇటు ఆర్థికంగా బలోపేతం చేసి.. ప్రజలందరి ముఖాల్లో సంతోషం చూడాలన్నదే తమ ప్రభుత్వ దృఢ సంకల్పమని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ రోజు రాష్ట్ర ప్రజలంతా గర్వపడేలా తాము పాలన సాగిస్తున్నామనే విషయాన్ని ఎంతో వినమ్రంగా ప్రకటిస్తున్నానని ఆయన అన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు, రాష్ట్ర అభివృద్ధికి అడుగడుగునా మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ, "జై ఆంధ్రప్రదేశ్" అంటూ చంద్రబాబు తన ట్వీట్‌ను ముగించారు.

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు..

మొదటి పేజీ తరువాయి...

రాజకీయంగా ఏకాభిప్రాయం సాధించాలని ప్రభుత్వం యత్నిస్తున్నట్లు సదరు వర్గాలు వెల్లడించాయి. ఈ సంప్రదింపుల్లో భాగంగా కేంద్రం ఇప్పటికే తమిళనాడుకు చెందిన డీఎంకేతో పాటు పలు కీలక ప్రాంతీయ పార్టీలతో ప్రాథమిక చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్య 1971 జనాభా లెక్కల ఆధారంగానే చేసి ఉంది. ఆ గడువు ముగియనుండటంతో కొత్తగా పునర్విభజన చేపడితే జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరిగి, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోతాయనే తీవ్ర ఆందోళనలు ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అందరికీ ఆమోదయోగ్యమైన ఫార్ములాను రూపొందించేందుకు కేంద్రం యత్నిస్తోందని సమాచారం. నిజానికి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంటు ముందుకు తీసుకువచ్చింది. అయితే ఆ సమయంలో ప్రాంతీయ పార్టీల నుంచి, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఫలితంగా ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై పార్లమెంటులో వ్యతిరేకంగా ఓటు వేయడంతో బిల్లు వీగిపోయింది. దీన్ని దృష్టిలో పెట్టుకునే.. ఈసారి బిల్లును నేరుగా సభలో పెట్టకుండా, ముందుగానే విస్తృత అవగాహన కుదిరిన తర్వాతే తదుపరి అడుగు వేయాలని కేంద్రం భావిస్తోందని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది.



## పర్యావరణ పరిరక్షణకు
# సైకిల్ వినియోగం

మొదటి పేజీ తరువాయి...

ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఆ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు సైకిల్‌పై వెళ్లనున్నారు. పర్యావరణ హితమైన సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రజలు, పార్టీ నేతలతోపాటు ప్రభుత్వంలో పని చేసే వారంతా శుక్రవారం సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణకు సంకల్పం తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం. ఈ సందర్భంగా గురువారం ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఆయన ఏమన్నారంటే.. 'రేపు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరం కలిసి ఒక సంకల్పం చేద్దాం. భూమి మన ఇల్లు? ప్రకృతి మన జీవనాధారం. పర్యావరణాన్ని రక్షించుకోవడం మన బాధ్యత. సహజ వనరులను కాపాడుకుంటూ, గాలి, నీరు, నేలను కలుషితం కాకుండా అందరూ కృషి చేద్దాం. పచ్చదనం పెంపు, ఇంధన వనరులు పొదుపుగా వినియోగించడం అవసరం. అందులో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న సైకిళ్లు, ఈ -సైకిళ్లపై ప్రయాణిద్దాం. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటుదాం. రేపటి నా విశాఖ పర్యటనలో నేను సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను. అంతా సహకరించాలని, మంచి కార్యక్రమానికి కలిసి రావాలని కోరుతున్నాను' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# చోడవరంలో బాబు వెన్నుపోటు నిరసన కార్యక్రమం

**చోడవరం జూన్ 4 జయ జయహే**

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన రాష్ట్ర ప్రజలకు నెరవేర్చలేని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచిందనీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండిపడింది. గురువారం చోడవరంలో బాబు వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమశీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తూరు జంక్షన్ లో పార్టీ నాయకులు మాట్లాడుతూ ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలను బాబు వెన్నుపోటుకు రెండు సంవత్సరాలు కార్యక్రమాన్ని నిర్వహించమని ఆదేశాలు ఇవ్వగా మాజీ మంత్రి ఉభయ పశ్చిమ గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ చోడవరం నియోజవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్నాథ్ పిలుపుమేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తూరు జంక్షన్ లో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద నుండి కొత్తూరు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి జంక్షన్లో మానవహారం నిర్వహించి, బాబు పాలన రెండేళ్లలో రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటుగా భావించాలని కోరుతూ కళ్ళకి గుంతలు కట్టుకొని శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టరు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసులు, గాంధీ గ్రామం సర్పంచ్ గాడి అప్పారావు,మండల అధ్యక్షులు సరిగడం చిన్ననాయుడు, చోడవరం వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షులు దేవరపల్లి వీర వెంకట సత్యనారాయణ సత్య, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పాడేరు నియోజకవర్గం పరిశీలకులు ఏడువాక సత్యారావు, సీనియర్ లీడర్ వేంపల్లి ఆనంద్, మాజీ డిసిసి చైర్మన్ పల్లా నర్సింగరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గునూరు రామచంద్ర నాయుడు,



అనకాపల్లి జిల్లా యువజన అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, వైఎస్ఆర్సిపి మండల నాయకులుమొల్లు సోమనాయుడు, జిల్లా నాయకులు ఓరుగంటి నెహ్రూ, చవితిన బాబురావు, చోడవరం పట్టణ యువజన అధ్యక్షుడు గూనురు రాజు, ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు ఉప్పల బాబు, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షులు లింగ బాబు, మాజీ జెడ్పిటిసి బొడ్డేటి సూర్యనారాయణ, రైతు విభాగ అధ్యక్షుడు బొడ్డు శ్రీరామమూర్తి, మండల మహిళా అధ్యక్షురాలు బొగ్గ శ్యామలమ్మ, మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ వేచలపు ప్రకాష్, శ్రావణ్, పి ఎస్ పేట వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు దన్నిన వెంకట్రావు, సూర్య ప్రకాష్, బూత్ కన్వీనర్ సత్తిబాబు తలారి, గరిక గోవింద, బొగ్గ చందు, చందు రాంబాబు మండల నాయకులు, కాశి దొడ్డివీధి, సత్తిబాబు అన్నవరం, చోడవరం పట్టణ మండల వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# అంగన్వాడి కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

**మాడుగుల జూన్ 4 జయ జయహే**

మాడుగుల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోగలఎం కోటపాడు 2 అంగన్వాడి కేంద్రం లో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సిడిపిఓ జి ఎర్రయ్యమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 5 ఏళ్ల లోపు పిల్లల్లో మెదడు అభివృద్ధి 90% ఉంటుందని .కావున ఒత్తిడి లేని విద్య అందించాలనీ, 3 సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడి లో చేర్పించాలని అక్కడ ఆట పాటలతో విద్య అందించడం జరుగుతుందన్నారు. పౌష్టికాహారం కూడా అందించడం జరుగుతుందని తల్లులకు వివరించారు. ఈ సందర్భంగా 5 సంవత్సరాల నిండిన పిల్లలకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్లు అందజేశారు. వారందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు హసీనా, రమణి, అంగన్వాడి కార్యకర్త పార్వతి తదితరులు పాల్గొన్నారు.



# డొక్కా సీతమ్మ భోజన నిర్వహకులకు శిక్షణ

**చోడవరం జూన్ 4 జయ జయహే**

చోడవరం మండలం లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథక నిర్వాహకులకు మండల కార్యాలయంలో గురువారం ఒకరోజు శిక్షణ కార్యక్రమశీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ వాష్ కార్యక్రమాల గురించి వివరించారు. వంట చేసే సమయంలో, వడ్డించే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు నీలకంఠం, సింహాచలం రిసోర్స్ పర్సన్ గా గౌరీపట్నం సోషల్ మాస్టారు గంగాధర్ పాల్గొని శిక్షణ ఇచ్చారు. సుమారు 70 మంది మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల నుండి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం రోజువారి మెనూ ప్రదర్శించగా అధికారులు ఈ భోజన స్టాల్స్ ను పరిశీలించి రుచి చూశారు.



# భారతీయ సంప్రదాయ కళలను పరిరక్షించాలి

**ఉత్తమ ప్రతిభ నృత్య కళాకారిణి ఉషశ్రీ కు ప్రశంసలు**

**ఒడిస్సా పూరీ క్షేత్రంలో జరిగిన నృత్య కళా ప్రదర్శనలు**

**టెక్కలి జూన్ 4 జయ జయహే**

సుప్రసిద్ధమైన భారతీయ సాంప్రదాయ కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందని ఒడిస్సా రాష్ట్రం పూరి జగన్నాథ స్వామి మహా క్షేత్రంలో గిన్నిస్ బుక్ అవార్డు గ్రహీత భారత్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకరాలు లలిత ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, తెలంగాణ రాష్ట్రాల నృత్య కళాకారులు పాల్గొనీ తమ ప్రతిభను కనబరిచారని ఆంధ్ర ప్రదేశ్ సమతా సైనిక దళ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు చల్లా రామారావు మాస్టారు నృత్య కళాకారుల ప్రతిభను కొనియాడారు, ఉషశ్రీ భవిష్యత్తులో మరెన్నో ప్రశంసలకు ఉంది శ్రీకాకుళం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని చల్లా రామారావు ప్రశంసించారు. ఈ సాంప్రదాయ నృత్య కళ ప్రదర్శనలలో శ్రీకాకుళం జిల్లా ఆదివారం పేట కు చెందిన బోనెల ఉషశ్రీ భరత నాట్యంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి పలువురి ప్రశంసలు పొందిన ఉషశ్రీ కి వారి గృహంలో తల్లిదండ్రులు శ్రేయోభిలాషుల సమక్షంలో సాలువ తో సత్కరించి జ్ఞాపికను అందజేశామన్నారు , 9వ తరగతి చదువుతున్న ఉషశ్రీ చిరు ప్రాయంలోనే భరతనాట్యంపై పట్టు సాధించడం పట్ల పలువురు ప్రశంసిస్తున్నారు, ఈమె శ్రీకాకుళం జిల్లా శ్రీ సత్య సాయి నృత్య కళా నికేతన్ లో భరతనాట్యం శిక్షణ పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో చల్లా రామారావు మాస్టరు తో పాటు తల్లిదండ్రులు బోనెల దుర్గారావు, తులసి, మామిడి అప్పల రాము, యడ్ల జానకిరావు, కుప్పిలి అనిల్, చిత్రి మల్లేష్, ప్రసాద్, రామారావు, ఉ మామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వం

**కోటబొమ్మాలిలో**

**వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం**

**టెక్కలి జూన్ 4 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాలి లో రైతు బజారు కూ డలి వద్ద వైయస్సార్సీపి ఆధ్వర్యంలో వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు, ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోయిందని వైయస్సార్సీపి టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త పేరాడ తిలక్ స్పష్టం చేశారు. ముందుగా కూ డలి లో ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి వైఎస్ఆర్సిపి శ్రేణులు నివాళులు అర్పించారు, చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పాలన ను నిరసిస్తూ నినాదాలు చేశారు, తెదేపా మేనిఫెస్టోను తిలక్ ఆధ్వర్యంలో దహనం చేశారు, ఈ కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ పరిశీలకులు చల్లా రవికుమార్, మండల పార్టీ అధ్యక్షులు హేమ సుందర్రాజు, ఎంపీపీ రోణంకి ఉమా మల్లయ్య జడ్పిటిసి దుబ్బ వెంకటరావు, పంచాయతీరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యరాజ్, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



# బాబు వెన్నుపోటుకు రెండేళ్లు

**ప్రజలను వంచించిన బాబు**

**మాడుగుల జూన్ 4 జయ జయహే**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను వంచించారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా మండిపడింది. రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాడుగుల బస్టాండ్ లో బాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షుడు వి రామ ధర్మజ, పట్టణ పార్టీ అధ్యక్షుడు బి శ్రీనివాసరావు, జడ్పిటిసి రమణమ్మ తదితరులు మాట్లాడుతూ బాబు ప్రభుత్వం ప్రజలను వంచిందని మండిపడ్డారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో మనోహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వ విధానాలపై నినాదాలు చేస్తూ మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు పి విజయలక్ష్మి, కే శ్రీనివాస్, కో ఆప్షన్ నెంబరు ఉన్నిష, మాజీ సర్పంచ్ వై కళావతి, మాజీ ఉ పసర్పంచ్ వరహాలు,పార్టీ నాయకులు ఎస్ జగ్గారావు, కే శ్రీధర్, ఎస్ సత్తిబాబు, టి రాము, కాళ్ళ రాము, రాజు,హేమంత్,భాస్కర్,మురళి, కే చలశీ నాయుడు, కాళ్ల అప్పలనాయుడు, సోలం రమేష్, ముమ్మిన రమణబాబు తదితరులు పాల్గొన్నారు.



# ఆయుర్వేద ఆసుపత్రిని పరిశీలించిన ఎండిఓ

**మాడుగుల జూన్ 4 జయజయహే**

మాడుగుల మండలం ఎం కోడూరులోగల ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిని ఎండిఓ కే అప్పారావు గురువారం సందర్శించి పరిశీలించారు ఈ సందర్భంగా ఆసుపత్రిలో గల సదుపాయాలు, మందులు లభ్యత, రోగుల హాజరు తదితర విషయాలను డాక్టర్ మౌనిక ని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసారు.



# పోలమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణానికి లక్ష పదివేలు విరాళం

**మాడుగుల జూన్ 4 జయ జయహే**

మాడుగుల ఇండియన్ బ్యాంకు సమీపంలో నిర్మిస్తున్న శ్రీ.పొలామాంబ ఆలయ నిర్మాణం కోసం దాతలు 1,10,000 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని గురువారం ఆలయ కమిటీ కి అందజేశారు. మాడుగుల గ్రామానికి చెందిన కీ, శే, వాడపల్లి శంకర్ రావు, వాడపల్లి రాములమ్మ పేరుమీద 60,000రూపాయలు, వారిఅల్లుడు అనకాపల్లి వస్తువులు యర్రశెట్టి గంగరాజు (రెల్లివీధి) భార్య కొండమ్మ కూతురు స్వాతి,అభి 50,000 విరాళం గా అందజేశారు. దీంతో ఆల కమిటీ వారు దాతలను అభినందించి ధన్యవాదాలు తెలిపారు.



# డయాలసిస్ పింఛను అందజేసిన ఎమ్మెల్యే

**చోడవరం జూన్ 4 జయ జయహే**

చోడవరం శివాలయం వీధిలో ఒమ్మి చిన్నబ్బాయి కి డయాలసిస్ పింఛన్ మంజూరయింది. నెలకి 15000 చొప్పున 2 నెలలు కలిపి 30,000 అతని భార్య ఒమ్మీ జయశ్రీ కి గురువారం స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు కార్యకర్తలు ఈవో జే గంగాధర్ వై పద్మావతి , నాగేశ్వరరావు పాల్గొన్నారు .



## పర్యావరణాన్ని కాపాడుకోవడం

# అందరి బాధ్యత

**అనకాపల్లి (జయ జయహే)**

మునగపాక మండలం అరబ్బు పాలెం పంచాయతీ పరిధిలో అనకాపల్లి జిల్లా అబ్దుల్ కలాం సేవా సంఘం చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటడం జరిగింది ఈ కార్యక్రమంలో అతిధులు గా మాజీ డివీఎంసీ సభ్యులు రేభాక మధుబాబు జనసేన నాయకులు కోయిలాడ గంగాధర్, తెలుగుదేశం పార్టీ గ్రామ వైస్ ప్రెసిడెంట్ నాయకులు బుద్ధ బుజ్జి, ప్రసాద్, చరణ్, తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా మాజీ డీవీఎంసీ నంబర్ రేభాక మధు బాబు, అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వాతావరణంలో కాలుష్యం పెరిగిపోవడం వల్ల వడగాలిపులు ఏ విధంగా వస్తున్నాయో మనం చూస్తున్నామని ఆక్సిజన్ శాతం కూడా తగ్గుతుందని ఇది ప్రతి ఒక్కరు గమనించాలని అభివృద్ధి పేరుతో రోడ్లు విస్తరణ పేరుతో ఎన్నో ఏళ్ల తరబడి ఉండే మొక్కలను తీసేస్తున్నారని తెలిపారు ఆ తీసివేసిన మొక్కలకి బదులుగా రోడ్డు చివరన అలాగే కాలవ గట్టును దగ్గర ప్రతి ఇంటికి బయట ప్రతి ఒక్క వ్యక్తి బాధ్యతగా తీసుకొని ఒక మొక్కని నాటే కార్యక్రమం ప్రతి పౌరులు చేపట్టాలని రానున్న రోజుల్లో పర్యావరణాన్ని మనం కాపాడుకోవాలని అన్నారు అబ్దుల్ కలాం సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో 40 మొక్కలు అరబుపాలెం పరిసర ప్రాంతాలలో బాదం చెట్లు, రావి చెట్లు, వేప చెట్లు, జామి కాము చెట్లను నాటడం జరిగిందని ఈ మొక్కలకు నీరు పోసి వాటిని పెంచే బాధ్యత యువత తీసుకుంటుందని అన్నారు అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్క రైతులందరికీ టాటా గ్లూకోజ్ పంచిపెట్టడం జరిగింది.



# భారత్‌పై మళ్లీ ట్రంప్ టారిఫ్ కొరడా

**(సి.హెచ్.ప్రతాప్)**

**అమెరికా అధ్యక్షుడు మరోసారి భారతదేశంపై టారిఫ్ కొరడా ఝుళిపించారు. ఇటీవల ప్రకటించిన అదనపు దిగుమతి సుంకాలు అంతర్జాతీయ వాణిజ్య రంగంలో చర్చనీయాంశంగా మారాయి. అమెరికా ప్రభుత్వం కొత్తగా భారతదేశం సహా అనేక దేశాలపై అదనంగా 12.5 శాతం వరకు టారిఫ్ విధించే ప్రతిపాదనను ప్రకటించింది. ముఖ్యంగా బలవంతపు కార్మిక వ్యవస్థతో తయారయ్యే వస్తువుల దిగుమతులను నియంత్రించడమే లక్ష్యమని అమెరికా పేర్కొంటోంది.**



ఈ అదనపు టారిఫ్‌ల వెనుక ప్రధాన కారణం అమెరికా అంతర్గత పరిశ్రమలను రక్షించడమే. చైనా, భారతదేశం వంటి దేశాల నుంచి తక్కువ ధరలకు వస్తువులు దిగుమతి కావడం వల్ల అమెరికా పరిశ్రమలు నష్టపోతున్నాయని ట్రంప్ ప్రభుత్వం వాదిస్తోంది. అంతేకాకుండా కొన్ని దేశాలు సరఫరా గొలుసుల్లో బలవంతపు కార్మిక వ్యవస్థను అరికట్టడంలో విఫలమయ్యాయని అమెరికా ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో "సెక్షన్ 301" చట్టం కింద కొత్త సుంకాలను అమలు చేయాలని నిర్ణయించింది.

భారతదేశంపై ఈ టారిఫ్‌ల ప్రభావం గణనీయంగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా ఔషధాలు, వస్త్ర పరిశ్రమ, ఉక్కు, ఆటోమొబైల్ విడిభాగాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు దెబ్బతినవచ్చు. అమెరికా భారతదేశానికి అతిపెద్ద ఎగుమతి మార్కెట్లలో ఒకటి కావడంతో భారతీయ కంపెనీలపై ఒత్తిడి పెరిగే అవకాశముంది. టారిఫ్‌లు పెరగడంతో భారతీయ ఉత్పత్తుల ధరలు అమెరికాలో అధికమవుతాయి. ఫలితంగా అక్కడి వినియోగదారులు ఇతర దేశాల ఉత్పత్తులవైపు మొగ్గుచూపే ప్రమాదం ఉంది. దీని ప్రభావం ఉపాధి, విదేశీ మారకద్రవ్య ఆదాయంపై కూడా పడవచ్చు.

అయితే ఈ పరిస్థితిని భారత్ వ్యూహాత్మకంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది. మొదటిగా అమెరికాతో




ద్వైపాక్షిక వాణిజ్య చర్చలను వేగవంతం చేయాలి. వివాదాస్పద అంశాలపై చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలి. రెండవదిగా భారతీయ ఎగుమతులను అమెరికాపైనే ఆధారపడకుండా ఇతర దేశాలకు విస్తరించాలి. యూరప్, ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాల్లో కొత్త మార్కెట్లను అన్వేషించాలి. మూడవదిగా దేశీయ పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలి. "మేక్ ఇన్ ఇండియా" వంటి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలి.

భారత ప్రభుత్వం సరఫరా గొలుసుల్లో పారదర్శకతను పెంచుతూ అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తున్నామని ప్రపంచానికి చాటాలి. అవసరమైతే ప్రపంచ వాణిజ్య సంస్థలో కూడా ఈ అంశంపై చట్టపరమైన పోరాటం చేయాలి. తాత్కాలిక ఒత్తిళ్లు ఉన్నప్పటికీ దీర్ఘకాలంలో స్వదేశీ పరిశ్రమల పోటీతత్వాన్ని పెంచడం ద్వారానే భారత్ ఈ సవాళ్లను అధిగమించగలదు.

ఇటీవల ప్రపంచవ్యాప్తంగా దేశాలు తమ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకునేందుకు సంరక్షణవాద విధానాలను అవలంబిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారతదేశం సాంకేతికత, నాణ్యత, ఉత్పాదకత పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందిస్తూ ఎగుమతి రంగాన్ని విస్తరించగలిగితే ప్రపంచ మార్కెట్లో భారతదేశ స్థానం మరింత బలపడుతుంది.

ప్రపంచ వాణిజ్యంలో పెరుగుతున్న సంరక్షణవాద ధోరణులు భారతదేశానికి హెచ్చరికలాంటివి. మారుతున్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చురుకైన వ్యూహాలతో ముందుకెళ్లినప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా నిలబడగలదు.

# ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిది

## నిర్లక్ష్యం వహిస్తే వినాశనమే

**(పుట్టా శ్రీనివాసరావు)**

ఇప్పటివరకు వివిధ కారణాలతో మానవ సమాజం ఐదు మహా ఉపద్రవాలు, వాటి నష్టాలు, కష్టాలు చూసింది . రాబోతున్న ఆరవ మహా ఉపద్రవం, దీనికి కార్బన్ డయాక్సైడ్ మూల కారణం. ఇదే జరిగితే దాదాపు బిలియన్ అరుదైన జాతులు అంతరించిపోతాయి.ఇప్పటికే దాదాపు పదివేల రెట్లు కనుమరుగవుతూ వస్తున్నాయి. నాగరికత పేరుతో, ఆధునీకరణ పేరుతో బొగ్గు, గ్యాస్, ఆయిల్ లాంటి అనేక విపరీత కార్బన్ డయాక్సైడ్ కారకాలైనటువంటి వాటిని నిత్య జీవితంలో రాత్రి పగలు పరిశ్రమల పేరుతో, రవాణా పేరుతో వాడుతున్నాం.మనదేశంలో పారిశ్రామిక విప్లవానికి ముందు 218 పి పి యం ( పొల్యూషన్ పర్ మిలియన్ ) ఉండేటువంటి కార్బన్ డయాక్సైడ్, తద్వారా కాలుష్య ప్రభావం నేడు 433 పి పి యం ప్రమాద స్థాయికి చేరుకుంది. గ్లోబల్ వార్మింగ్ లో కారణాలు ఎన్ని ఉన్నా 50% పైగా కార్బన్ డయాక్సైడ్ కీలకంగా ప్రభావితం చూపుతుంది . అందువలన కార్బన్ డయాక్సైడ్ ద్వారా ఎదురయ్యే ముప్పు నుండి బయట పడేందుకు ప్రభుత్వాలు కార్బన్ లాకర్లను సిద్ధం చేయాలి, కార్బన్ ఎనర్జీని ఒక సోర్స్ గా, రీసైకిలింగ్ ఉపయుక్తంతో మార్కెట్ వస్తువుగా తయారు చేసే పరిశోధనలు, వ్యాపారాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. గ్రీన్ కవర్, గ్రీన్ పవర్, గ్రీన్ టెక్నాలజీ యుద్ధ ప్రాతిపదికన వాడుకల్లోకి తేవాలి. మానవాళి మనుగడకు 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా జీరో కార్బన్ చేయాలనేది అంతర్జాతీయ సంస్థల నిర్ణయం. రాబోయే రోజుల్లో కార్బన్ క్రెడిట్, కార్బన్ ట్రేడింగ్, కార్బన్ ఫైనాన్స్ లాంటివి రావాలి. పర్యావరణానికి తీవ్ర విఘా తంగా ఉన్నటువంటి కార్బన్ వ్యర్థ పదార్థం కాదు బేకింగ్ సోడా లాంటి సాలిడ్, యూరియా తయారీకి, చల్లదనానికి ఉపయోగించే డ్రై ఐస్ తరహా మార్కెట్ కమర్షియల్ సోర్స్ గా అవసరమైతే సూర్యశక్తిని జోడించి సర్క్యులర్ ఎకానమీలా పునర్ ఉత్పత్తికి నూతన ఆవిష్కరణలు జరగాలి.గ్రీన్ కవర్, గ్రీన్ పవర్, గ్రీన్ టెక్నాలజీ పర్యావరణానికి శ్రీరామరక్ష.

**ప్రకృతిని మనం కాపాడడం లేదు.**

పకృతే మనల్ని ఇన్నాళ్లు కాపాడుతుంది" అనే నిజం తెలుసుకొనే రోజు ఇ ది.. మొక్కలు నాటడం మంటే మనల్ని మనం రక్షించుకోవడమే

పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మనం ఒక్క మొక్క నాటక పోయినా పర్వాలేదు కానీ ఒక్క ప్లాస్టిక్ కవర్ వాడకుండా,




ఒక్క ముద్ద అన్నం వృధా చేయకుండా ఉంటామనేది ప్రామాణికంగా పెట్టుకోవాలి. పర్యావరణాన్ని కాపాడడానికి మనం హీరోలు అవ్వక్కర్లేదు. మన పని మనం నిజాయితీగా, నేలకు హాని చేయకుండా చేస్తే చాలు. ప్రతి ఏడాది జూన్ 5 వస్తే చాలు స్కూలు పిల్లలతో మొక్కలు నాటిస్తాం, ఫోటోలు దిగుతాం, సోషల్ మీడియాలో పెడతాం.మరుసటి రోజుకి ఆ మొక్కకు నీళ్లు పోసే నాధుడు ఉండడు, ఇది కాదు పర్యావరణ దినోత్సవం అంటే. చెట్లు నాటడం మే కాదు.. వాటి ద్వారా , మనల్ని మనం సంరక్షించుకుంటున్నామనే సంకల్పంతో ముందుకెళ్లాలి. ప్రపంచంలో పర్యావరణ పరిరక్షణలో అగ్రస్థానంలో ఉన్న దేశంలో డేన్మార్క్. తర్వాత స్థానంలో యూకే, స్వీడన్ ఫిన్లాండ్, మాల్టా లాంటి దేశాలు ఉన్నాయి. డెన్మార్క్ దేశంలో పునరుత్పాతక ఇందన లక్ష్యంగా పెట్టుకున్నారు. 2030 నాటికి బొగ్గు, చమురు పూర్తిగా బంద్ చేయాలనే లక్ష్యం తో ఆ దేశం లో చర్యలు తీసుకున్నారు.2024 నాటికే 67 శాతం విద్యుత్తు సహజ సిద్ధంగా గాలి మరలు, సోలార్ నుంచే వాడటం మొదలు పెట్టారు .

**గ్రీన్ టాక్స్ విధానం**

సైకిలు,ఎలక్ట్రికల్ వాహనాలు వాడితే ప్రభుత్వం ప్రజలకు డబ్బు చెల్లిస్తుంది. ఇక్కడ ఫుడ్ వేస్ట్ చట్టం ఉంది. ఆహారం వృధా చేస్తే నేరంగా పరిగణిస్తారు.2030 దేశంలో వ్యవసాయ భూమి 25 శాతం ఆర్గానిక్ భూమిగా లక్ష్యం. బలంగా క్లైమేట్ యాక్ట్ పనిచేస్తుంది. డెన్మార్క్ పర్యావరణంలో మొదటి స్థానంలో ఉండడానికి కారణం ప్రజలు, ప్రభుత్వం, ప్రవేట్ యజమాన్యాలు కలిసి సంయుక్తంగా పర్యావరణకు పరిరక్షణ కు కృషి చేస్తారు. 2025 నాటికీ వివిధ అధ్యయన సంస్థల అంతర్జాతీయ నివేదికల ప్రకారం ప్రపంచంలో 40 శాతం వ్యవసాయ భూమి ఇప్పటికే ఎరువులు, రసాయనాలు, క్రిమిసంహారకాలు వాడటంతో " డెడ్ సాయిల్ "గా అయిపోయింది నివేదికలు చెబుతున్నాయి. రసాయన ఎరువులు పురుగుల మందులు వాడకం వల్ల నేలలో సూక్ష్మజీవులు లేని పరిస్థితి.కొసమెరుపు : అభివృద్ధి అవసరమే, అభివృద్ధికి ఎవరు వ్యతిరేకం కాకూడదు. అభివృద్ధి పేరుతో ఎవరి లక్ష్యాలను నెరవేరుస్తాం అనేది ముఖ్యం. ఉత్తరాంధ్రలో విశాఖ కేంద్రంగా శర వేగంగా వస్తున్న డేటా సెంటర్లు పై గ్రీన్ టెక్నాలజీ ఉపయోగించి మనకు కానీ, మన భావితరాలకు కానీ లాభం, ఉపయుక్తం కాక పోయినా పర్వాలేదు కానీ, పర్యావరణ నష్టాలు, కష్టాలు రాకుండా చూడాలి. రాబోయే తరాల పర్యావరణ ప్రయోజనాలు ఫణంగా పెట్టకూడదు. దీనిపైన జాతీయ, రాష్ట్రం తో పాటు ఆంధ్ర విశ్వవిద్యాలయం నిపుణులతో కమిటీ ఏర్పాటుచేసి క్షేత్రస్థాయిలో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల ఇపిఐ లెక్కల్లో 2024 నాటికి భారత దేశం 176 స్థానంలో ఉంది. దేశం, రాష్టం ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి, కలుషితం కాకుండా కాపాడుకోవాలి. ఆర్గానిక్ వ్యవసాయం చేసే రైతులకు ఎక్కువ సబ్సిడీ, సరళ తర తక్కువ వడ్డీతో రుణాలు, శిక్షణ ప్రభుత్వం లక్ష్యం కావాలి. మనకున్నటువంటి సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.

**ఉత్తరాంధ్రకు పర్యావరణమే ప్రాణం**

ఒకపక్క సహజ సిద్ధమైన తూర్పు కనుమలు, మరోపక్క నదులు, సుదూర సముద్ర తీర ప్రాంతం, అడవులు ఇలా ప్రకృతి తో మమేకమైన ప్రాంతం ఉత్తరాంధ్ర . అయితే ఉత్తరాంధ్రలో పర్యావరణ పరిరక్షణకు పలు చర్యలు చేపట్టాల్సిన అవసరం కనిపిస్తోంది.తీర ప్రాంతం కోతకు గురి కాకుండా "మడ అడవులను" పాయకరావుపేట మొదలు ఇచ్చాపురం వరకు పెంచాలి.దీనికి తోడుగా తీరప్రాంతాల్లో సరుగుడు చెట్టు కూడా యుద్ధ ప్రాతిపదికన పెంచాలి. దీనికి మత్స్యకార కుటుంబాల ఉపాధిగా మడ అడవులు, సరుగుల చెట్టు పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సహించాలి. మనకు అవసరం లేని, ఎవరికో ఆర్థికంగా ఉపయోగపడేటువంటి బాక్సైట్ లాంటి వివిధ ఖనిజ తవ్వకాలను పూర్తిగా నిషేధించాలి. గాలి కాలుష్యానికి కారకాలవుతున్న వాటిని గుర్తించాలి. ఇప్పటికే ఉత్తరాంధ్రలో విశాఖపట్నం లో డేంజర్ బెల్స్ స్థాయికి చేరింది. తీవ్ర కాలుష్యానికి కారణం అవుతున్న పరిశ్రమలను చిత్తశుద్ధితో నియంత్రించాలి. జీరో లిక్విడ్ డిశ్చార్జ్ నిబంధనలు పాటించి, వివిధ ఫార్మా కంపెనీల ద్వారా కలుషిత నీటి ప్రభావం లేకుండా చేయాలి. వంశధార, నాగావళి, చంపావతి, శారద, గోస్తనీ లాంటి నదులు పుట్టినిల్లు ఉత్తరాంధ్ర. వీటి వద్ద అక్రమ ఇసుక తవ్వకాలకు, తీర ప్రాంతాలు ఆక్రమణలకు గురికాకుండా చూడాలి. గ్రామాల్లో మురుగు శుద్ధి కుంటలు ఏర్పాటు చేసి తామర మొక్కలు పెంచే దిశగా చర్యలు ఉండాలి. వాన నీటిని ఒడిసిపట్టే ఇంకుడు గుంతలు తప్పనిసరి చేయాలి. దీనికి 90 శాతం సబ్సిడీ ప్రకటించాలి. ప్లాస్టిక్ నిషేధం నిబంధనను చిత్తశుద్ధి అమలు చేయాలి. అసలు ప్లాస్టిక్ ఉత్పత్తి చేసే పరిశోధన మీద మార్కెటింగ్ చేసి వ్యాపారం చేసే సంస్థల్ని నిరోధించాలి. నేటి తరాలకు ఒక విద్యార్థి ఒక మొక్క నాటి, పది సంవత్సరాల పాటు ఆ చెట్టు ఆలనా పాలన చూస్తే ఆ విద్యార్థికి పదో తరగతిలో అదనపు మార్కులు ఇస్తామన్న నిబంధన తీసుకురావాలి. ఆర్గానిక్ పండ్లను ఆర్గానిక్ కూరగాయలను ఆర్గానిక్ చిరుధాన్యాలను విస్తృతంగా ప్రోత్సహించాలి.



# పుష్కర్ ఘాట్ జంక్షన్‌లో పర్యావరణ మానవహారం

## ప్లాస్టిక్ రహిత నగర నిర్మాణానికి పిలుపు



**రాజమహేంద్రవరం, జూన్ 4, జయజయహే:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పుష్కర్ ఘాట్ జంక్షన్‌లో గురువారం సాయంత్రం పర్యావరణ అవగాహన కార్యక్రమం, మానవహారం నిర్వహించారు. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన స్టాళ్లను పరిశీలించిన అతిథులు అనంతరం మానవహారంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. "కలిసికట్టుగా నడుద్దాం -- గోదావరిని కాపాడుకుందాం" అనే నినాదాలతో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని అన్నారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు క్లాత్ బ్యాగులు, పర్యావరణహిత వాటర్ బాటిళ్ల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల నదులు, డ్రైనేజీ వ్యవస్థలు, పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని పేర్కొన్నారు. రానున్న గోదావరి పుష్కరాల నాటికి జిల్లాలో ప్లాస్టిక్ వినియోగ నియంత్రణకు మరింత కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు హాజరయ్యే సమావేశాల్లో ఇకపై ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు ఉపయోగించవద్దని స్పష్టం చేసిన కలెక్టర్, వాటి స్థానంలో గాజు సీసాలు లేదా స్టీల్, గాజు గ్లాసుల్లో తాగునీరు అందించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వ శాఖలు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ 'మై ఘాట్ -- మై రెస్పాన్సిబిలిటీ' కార్యక్రమం ద్వారా రాజమహేంద్రవరంలోని 14 ఘాట్‌ల రూపురేఖలు మారనున్నాయని అన్నారు. ఘాట్‌ల పరిశుభ్రతను ప్రోత్సహించేందుకు ప్రతి నెల ర్యాంకింగ్‌లు ప్రకటిస్తే పోటీతత్వం పెరిగి మెరుగైన ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రజలు అలవాటు చేసుకోవాలని కోరారు. నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ 'మై గోదావరి -- మై ప్రైడ్' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన 'మై ఘాట్ -- మై రెస్పాన్సిబిలిటీ' కార్యక్రమం గోదావరి ఘాట్‌ల పరిరక్షణకు దోహదపడుతుందని చెప్పారు. రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఘాట్‌లను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, విద్యా సంస్థల సహకారంతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. నగరాన్ని పరిశుభ్రమైన, కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా 'మై ఘాట్ -- మై రెస్పాన్సిబిలిటీ' బ్రోచర్‌ను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం పాల్గొన్న వారితో పర్యావరణ పరిరక్షణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిరోధం, గోదావరి పరీవాహక ప్రాంతాల సంరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సెక్రటరీ శైలజవల్లి, ఎస్ఈ రీటా, ఎంహెచ్‌వో ఎ. వినూత్న, మేనేజర్ అబ్దుల్ మలిక్, రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు... వైఎస్ఆర్‌సీపీ ఆందోళన



**జంగారెడ్డిగూడెం,జయ జయహే**

వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చంద్రబాబు వెన్ను పోటుకు రెండేళ్లు అనే పేరుతో నిర్వహించిన నిరసన కార్యక్రమం విజయవంతమయ్యిందని నియోజకవర్గం ఇంచార్జి కంభం విజయ రాజు పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు చింతలపూడి నియోజకవర్గస్థాయి కార్యక్రమం గురువారం ఇన్చార్జ్ విజయరాజు నాయకత్వంలోజరిగింది. మండల వైసీపీ అధ్యక్షుడు ఓరుగంటి నాగేంద్ర కుమార్, పట్టణ అధ్యక్షుడు కర్పూరం గవరయ్య గుప్త సారధ్యంలో పాత బస్టాండ్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్దమానవ హారం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో పట్టణ మరియు మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని, మోసపూరితమైన వాగ్దానాలు చేసి ప్రజలకు వెన్నుపోటు తెలుగుదేశం పార్టీ,కూటమి ప్రభుత్వం, పొడిచిందని నినాదాలు చేశారు. విజయరాజు మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలకు వెన్నుపోటు పొడిచి అధికార దాహంతో అనేక అసత్య వాగ్దానాలతో నమ్మించి చంద్రబాబు ప్రభుత్వం గద్దెనెక్కిందని ధ్వజ మెత్తారు. నేటికీ కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసిన సూపర్ సిక్స్ గాని ఇతర వాగ్దానాలు అమలు చెయ్యాలేదని పేర్కొన్నారు. ప్రచారం లో నీకు 15000 నీకు 15 000 అని ప్రజలను నమ్మించారని, నిరుద్యోగులకు 3,000 ఇస్తామని నమ్మబలికారని ఏద్దేవాచేశారు. ఇలా అనేక మైన వాగ్దానాలు నేటికి నెరవేర్చలేదని అందుకే ఈ ప్రభుత్వాన్ని ప్రజా వెన్నుపోటు ప్రభుత్వమని మండి పడ్డారు.

# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు

## దుర్మార్గ, రాక్షస, అరాచక పాలనపై నిరసన కార్యక్రమం



**విశాఖపట్నం (జయ జయహే)**

అమలుకాని మోసపూరిత హామీలతో,తప్పుడు వాగ్దానాలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లుగా చంద్రబాబు దుర్మార్గ, రాక్షస, అరాచక పాలనను ప్రజలకు తెలియజేసేందుకు వెన్నుపోటుకు రెండేళ్ళు పేరుతో విశాఖ ఉత్తర నియోజకవర్గంలో విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు,విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు ఆదేశాలు మేరకు క్లస్టర్-3, 45,46,47,54వార్డులు కటుమూరి సతీష్,సేనాపతి అప్పారావు,పైడి రమణ,బలిరెడ్డి గోవింద్,కె.సుకుమార్,కడితి చిరంజీవి ఆధ్వర్యంలో కంచరపాలెం హైవే జంక్షన్లో చంద్రబాబు,పవన్ కళ్యాణ్ ఎన్నికలకు ముందు ఇచ్చిన మోసపూరిత హామీలకు సంబంధించిన పత్రాలను ప్రదర్శిస్తు అగ్ని మంటల్లో వేసి నిరసన చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో హరిపట్నాయక్,కె.చిన్న,యన్.కృష్ణ,గణేష్,రాఘవులు,సురేష్,నీలాపు ఈశ్వర్,చందురెడ్డి, కృపా,అనిల్, కనకరాజు,బొట్ట రాజు,నాగరాజు,శంకర్,లావణ్య,అప్పలరెడ్డి,అచ్చుతరవు,మోపాన్,దిలీప్,శ్రీను,సన్నీ,గణపతి,నేపాల్ శ్రీను,రాంబాబు,శ్రీను,సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



# మైనారిటీల విద్యాభివృద్ధి కోసం కృషి

## చంద్రబాబు హయాం లోనే మైనారిటీల సంక్షేమం

### మైనారిటీ,న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి జూన్ 04 (జయ జయహే )**

మైనారిటీల విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ బద్దంగా కృషి చేస్తున్నదని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. రాష్ట్రస్థాయిలో పదవ తరగతి, ఇంటర్ విద్యలో అత్యుత్తమ మార్కులు సాధించిన మైనారిటీ విద్యార్థులను గురువారం మంత్రి సన్మానించి ఆశీర్వదించారు. వెలగపూడి సచివాలయం మూడవ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్లో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ విద్య తోనే తాము అనుకున్న ఉన్నత స్థాయికి యువత ఎదిగి దేశ నిర్మాణ ప్రక్రియలో పాలుపంచుకోగలరని అన్నారు. మైనారిటీ కుటుంబాల్లో విద్యార్థుల శ్రేయోభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇటీవలనే వక్ఫ్ బోర్డు ద్వారా తాలిం ఏ హునర్ పథకం క్రింద కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత రెసిడెన్షియల్ ఇంటర్ విద్య కోసం నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో ప్రతిభగలిగిన 250 మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. మైనారిటీ కుటుంబాలలోని ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ఉచిత డీఎస్సీ శిక్షణ, పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో మైనారిటీల సంక్షేమ శాఖ ఇంచార్జ్ సెక్రటరీ సూర్య కుమారి, మైనారిటీ కార్పొరేషన్ ఎండి యకూబ్ భాష, క్రిస్టియన్ కార్పొరేషన్ ఎండి శేఖర్, డిడి సరోజినీ, అధికారులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ప్రారంభమైన జ్ఞాన ప్రకాష్ శిక్షణ కార్యక్రమాలు

**చోడవరం జూన్ 4 జయ జయహే**

రాష్ట్ర వ్యాప్తంగా 6 రోజుల పాటు జరిగే జ్ఞాన ప్రకాష్ (యాప్.ఎల్.యన్) శిక్షణా కార్యక్రమాలు గురువారం చోడవరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్రారంబమయ్యాయి చోడవరం జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల లో ప్రారంభమైన జ్ఞాన ప్రకాష్ కార్యక్రమంలో భాగంగా 60 రోజులు సర్టిఫికెట్ కోర్స్ కు సెకండరీ స్థాయి ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పది మండలాల నుండి 270 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. వీరికి తొమ్మిదో తేదీ వరకు శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుంది. ఈ శిక్షణ ద్వారా ప్రాథమిక పాఠశాలలో కనీసభ్యసన సామర్థ్యాలు సాధన కొరకు ఎఫ్ ఎల్ ఎన్ సాధనకై శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణా కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్ గా ఐవీ రామిరెడ్డి , ప్రత్యేక పర్యవేక్షకులుగా చోడవరం మండల విద్యాశాఖ అధికారులు నీలకంఠం, సింహాచలం వ్యవహరిస్తున్నారు. 15 మంది డిఆర్పీలు పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కేఆర్పీగా ఉమామహేశ్వర రావు,రాజ్ కిరణ్ వ్యవహరిస్తున్నారు.

# వెండర్ జోన్‌కు శంకుస్థాపన

**ఎండాడ, జూన్ 4: (జయ జయహే)**



ఎండాడ ఆర్.ఆర్.ఆర్. సెంటర్ దగ్గర జీవీఎంసీ స్మార్ట్ వెండింగ్ జోన్ కు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో శ్రీకారం చుట్టిన వెండర్ జోన్ విధానం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఎండాడలో రోడ్డు పక్కన తోపుడు బళ్ల వంటి వ్యాపారుల వల్ల ట్రాఫిక్ కి ఇబ్బంది కలుగుతోందని చెబుతూ వారి జీవనోపాధికి ఇబ్బంది లేకుండా రూ.1.5 కోట్లతో కంటైనర్ వెండర్ జోన్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. 50 నుంచి 70 మందికి వ్యాపారులకు కేటాయించే అవకాశమున్న ఈ జోన్ లో టాయ్ లెట్లు, మంచినీరు, లైట్లు, సీటింగ్, చిల్డ్రన్ ప్లే ఏరియా, పార్కింగ్ వంటి సౌకర్యాలు సహా సోలార్ పవర్ కూడా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, ఈఈ శాంతిరాజు, కూటమి నాయకులు చెట్టుపల్లి సన్యాసిరావ, లొడగల అప్పారావు, చెట్టుపల్లి గోపి, దొరబాబు, మంగాదేవి, రవికుమార్, సారిపల్లి శ్రీను, దేవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయజయహే

# దళిత క్రైస్తవులపై దాడులు పెరిగాయి

## జడా శ్రావణ్ కుమార్

**రాజమహేంద్రవరం, జూన్ 4, జయజయహే:**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత కొన్ని నెలలుగా దళిత క్రైస్తవులపై దాడులు, వివక్షాత్మక చర్యలు పెరిగాయని జై భీమ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జడా శ్రావణ్ కుమార్ ఆరోపించారు. గురువారం రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో దళిత క్రైస్తవుల రాజకీయ, సామాజిక హక్కులను కూటమి ప్రభుత్వం హరిస్తోందని ఆయన విమర్శించారు. ఇది కేవలం ఒక మతం లేదా కులానికి సంబంధించిన సమస్య కాదని, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటమని పేర్కొన్నారు. రాష్ట్రంలో నెలకొంటున్న పరిస్థితులకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు వ్యవహార శైలే ప్రధాన కారణమని ఆరోపించారు.గత 30 ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న ఒక ఆలయాన్ని వివాదాస్పద అంశంగా మార్చి స్థానిక ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరిగాయని ఆయన అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా చోటుచేసుకున్న మతపరమైన ఉద్రిక్తతలకు రఘురామకృష్ణంరాజు చర్యలే కారణమని ఆరోపించారు. ఆయన వ్యవహారాల వల్ల నెల రోజుల పాటు ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు.ఆ ఘటనల నేపథ్యంలో దళితులను అన్యాయంగా అరెస్టు చేసి హింసించారని, బాధితులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు రద్దు చేయాలని డిమాండ్ చేయడం రాజ్యాంగ




స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. క్రైస్తవ మత విశ్వాసాలను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సమాజంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే చర్యగా పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.దళితుల ఓట్లు తనకు అవసరం లేదని చెప్పడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, ప్రజాప్రతినిధిగా అలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని విమర్శించారు. దళితుల ఓట్లు వద్దనుకునే వారు వారి నుంచి పన్నులు కూడా తీసుకోకూడదని వ్యాఖ్యానించారు.చర్చిలపై మైకులు తొలగించాలని డీజీపీకి లేఖ రాయడం, అనధికారికంగా నడుస్తున్న చర్చిలకు నోటీసులు జారీ చేయడం వంటి చర్యలు మత స్వేచ్ఛను దెబ్బతీసే విధంగా ఉన్నాయని అన్నారు. జర్నలిస్టులను కూడా కించపరిచేలా వ్యాఖ్యానించడం సమంజసం కాదని చెప్పారు.దళిత క్రైస్తవుల హక్కుల పరిరక్షణ కోసం జై భీమ్ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. జూన్ 28న ఏలూరులో నిర్వహించనున్న "ఆత్మ పోరాట సభ"ను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే ఆయన వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ అధికారిక వైఖరిగా పరిగణిస్తామని హెచ్చరించారు. ప్రజల మనోభావాలను గౌరవించని ప్రభుత్వానికి 2029 ఎన్నికల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని జడా శ్రావణ్ కుమార్ అన్నారు.



# వావిలాల కుమారి లీలా మహేశ్వరి ధన్య జీవి

## అంబటి రాంబాబు

**గుంటూరు (జయ జయహే)**

అంతరించిపోతున్న విలువలకు ప్రతిరూపం వావిలాల గోపాలకృష్ణయ్య వారి ఆశయాలను, లక్ష్యాలను కొనసాగించిన స్వర్గీయ వావిలాల కుమారి లీలామహేశ్వరి ధన్యజీవి అని మాజీ మంత్రి వైయస్సార్ సిపి సీనియర్ నేత అంబటి రాంబాబు కొనియాడారు. స్వర్గీయ కుమారి వావిలాల లీలామహేశ్వరి 88వ జయంతి సందర్భంగా ఈ నెల 4వ తేదిన గురువారం గుంటూరు లోని వావిలాల సంస్థ ఆడిటోరియంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి కీ.శే. వావిలాల గోపాలకృష్ణయ్య మనవడు, వావిలాల సంస్థ కార్యదర్శి మన్నవ సోడేకర్ అధ్యక్షత వహించారు. అంబటి రాంబాబు ప్రసంగిస్తూ స్వర్గీయ వావిలాల గోపాలకృష్ణయ్యకు వెన్నంటిఉంటూ వారు తుది శ్వాస విడిచే వరకూ సేవలు అందించిన మహనీయురాలు స్వర్గీయ కుమారి వావిలాల లీలామహేశ్వరి అని తెలిపారు. కీర్తిశేషులు వావిలాల గోపాలకృష్ణయ్య 1952 నుండి 1972 వరకు 4 సార్లు సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యునిగా అద్వితీయమైన కృషి చేశారని తెలిపారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ వావిలాల కుటుంబంతో 1988 నుండి సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమం, సారా వ్యతిరేక ఉద్యమంలో కలిసి పనిచేసే అదృష్టం కలిగిందన్నారు. 1991 నుండి 2001 మధ్య దశాబ్ద కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అక్షరాస్యత 17 శాతం పెరిగిందని, సారా వ్యతిరేక ఉద్యమం విజయవంతమై సంపూర్ణ మధ్యనిషేధశీ అమల్లోకి వచ్చిందని పొదుపు ఉద్యమం ప్రారంభమై మహిళలు సంఘటితమైనారని తెలిపారు. నేడు అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, తండ్రి కొడుకులు ఘర్షణ పడే వాతావరణం ఉందని స్వర్గీయ కుమారి వావిలాల లీలామహేశ్వరి వివాహం చేసుకోకుండా తోబొట్టువులుగా ఉన్న 12 మందిని చదివించి అభివృద్ధి చేయడమే కాక వావిలాల గోపాలకృష్ణయ్య అనారోగ్య పాలైన రోజుల లో సైతం కన్నబిడ్డగా సేవలను అందించారన్నారు.ఈ కార్యక్రమం లో అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, వావిలాల సంస్థ పూర్వ చైర్మన్ డా॥ ఎం.డి .వి రమణ రావు, ప్రొఫెసర్ మాజేటి సోమశేఖర్, పూర్వ ప్రిన్సిపాల్ డా॥ వి. సుబ్బారాయుడు, వావిలాల కుటుంబ సభ్యులు వావిలాల రమ,వావిలాల సత్యం, వావిలాల భారతి, సీనియర్ జనరల్ లిస్ట్ జన భారతి చంద్ర, బిజెపి నేత ఆర్. లక్ష్మీపతి జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ భువనగిరి కృష్ణవేణి, డాక్టర్ ధోనె రాంబాబు ప్రిన్సిపాల్ వావిలాల గ్రంథాలయ శాస్త్ర పాఠశాల, మనోరమ పూర్వ ప్రధాన ఉపాధ్యాయురాలు బండ్లమూడి హనుమాయమ్మ హై స్కూల్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# శక్తి యాప్‌పై భక్తులకు అవగాహన కల్పించిన పోలీసులు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో, నిడదవోలు సీఐ తిలక్ పర్యవేక్షణలో కొవ్వూరు జోన్ నిడదవోలు సర్కిల్ శక్తి టీమ్ మరియు ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో కోట సత్తెమ్మ తల్లి అమ్మవారి దేవాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శక్తి టీమ్ ఏఎస్ఐ గంగాధరరావు, మహిళా కానిస్టేబుల్ శాంతి, ఈగల్ టీమ్ ఏఎస్ఐ వెంకట్రావు పాల్గొని, గుడి సిబ్బంది సమక్షంలో సుమారు 40 మంది భక్తులకు శక్తి యాప్ వినియోగం, ప్రయోజనాలు మరియు ప్రాముఖ్యతపై వివరించారు.మహిళల భద్రత, చిన్నారుల రక్షణ కోసం శక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, ఆధార్ వివరాలు, అనుమానాస్పద ఏపీకే (ఏపీకి) లింకులు ఎవరికీ ఇవ్వకూడదని సూచించారు. ఫోటో మార్ఫింగ్, ఆన్‌లైన్ లోన్ యాప్ మోసాలు, సైబర్ మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రయాణాల సమయంలో విలువైన ఆభరణాలు, నగదు వంటి వస్తువులను బ్యాగుల్లో ఉంచేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్న పిల్లలను ఒంటరిగా వదిలిపెట్టకూడదని సూచించారు. ఒంటరిగా ప్రయాణించే మహిళలు శక్తి యాప్‌ను వినియోగించడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం పొందవచ్చని వివరించారు.అలాగే గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల వినియోగం లేదా విక్రయాల గురించి సమాచారం తెలిసిన వెంటనే భయపడకుండా పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల భద్రత, మహిళల రక్షణ మరియు సైబర్ నేరాల నివారణ లక్ష్యంగా ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.





# మలేరియా కట్టడికి కార్యాచరణ ప్రణాళికను సిబ్బంది పాటించాలి

## సబ్‌యూనిట్ అధికారి నగేష్‌పట్నాయిక్

**మద్దిలపాలెం:( జయ జయహే):**

మలేరియా కట్టడికి రూపొందించిన కార్యచరణ ప్రణాళికను ప్రతి ఒక్క సిబ్బంది పక్కాగా పాటించాలని విశాఖపట్నం మలేరియా సబ్‌యూనిట్ అధికారి నగేష్ పట్నాయిక్ పేర్కొన్నారు. సబ్‌యూనిట్ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ మలేరియా మాసోత్సవాలలో భాగంగా అమలు చేస్తున్న కార్యచరణలో భాగస్వాములుకావాలని సూచించారు. ఈ కార్యచరణలో మలేరియా సబ్ యూనిట్ సిబ్బందితోపాటు, అర్బన్ ఆరోగ్య కేంద్రంలో గల ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది సంయుక్తంగా పాల్గొలని అన్నారు. జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది రోజూ ఉదయం వేళలలో చేస్తే ఇంటింటి సందర్శనలో దోమల ఉత్పత్తికి దోహదపడే నీటి నిల్వలను గుర్తించి వాటిని తొలగించేలా పర్యావేక్షణ చేయాలన్నారు. దోమల ఉత్పతికి ఆవాసాలు గుర్తించే కీలక చర్య కావడంతో దీన్ని పక్కగా చేయాలని ఆదేశించారు. లార్వా గుర్తించి త్వరగా తొలగిస్తే దోమల ఉత్పత్తని నియంత్రించలగమన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా జీవీఎంసీ మలేరియా సిబ్బంది ఇంటింటి సందర్శనలో చేపడుతున్న చర్యలు పక్కగా ఆమలు చేయాలన్నారు. అనంతరం అర్భర్--1 సబ్ యూనిట్ అధికారి శేషబాబు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం, మంగాళవారాలలో అర్బన్ ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం. ఆశా వర్కర్లు వారి నిర్ధేశించిన మార్గాదర్శలమేరకు డ్రైడే చర్యలు పట్టిష్టవంతంగా చేపట్టాలన్నారు. సబ్‌యూనిట్ సిబ్బంది వారి విధులలో భాగస్వాములు కావాలన్నారు. ఈసమావేశంలో సబ్‌యూనిట్ అధికారి హరిక్రిష్ణ, మలేరియా సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొలన్నారు.



# మురికికాల్వల్లో మంచినీటి బోర్లా?

## డ్రైనేజీ నిర్వహణ తీరు పట్ల గంటా ఫైర్

**తగరపువలస, జూన్ 4: (జయ జయహే)**

మురికికాల్వల్లో బోర్లు తవ్వి నీరు వినియోగిస్తున్న వారికి భారీ జరిమానాలు విధించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. కలుషితమైన నీటి వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలకు ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. తగరపువలసలో తీవ్రంగా ఉన్న డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్యలను గురువారం ఆయన పరిశీలించారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీలో సాఫీగా ప్రవహించాల్సిన మురుగు నీటికి అడ్డంగా ఉన్న బోర్లు, మోటార్లు చూసి ఫైర్ అయ్యారు. పాతికేళ్లుగా ఈ బోర్లు వాడకంలో ఉన్నాయని తెలుసుకుని అధికారులు తీరు పట్ల అసహనాన్ని ప్రదర్శించారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలకు జోనల్ కమిషనర్ ఎం.విజయ్ కుమార్ ను ఆదేశించారు. మెయిన్ రోడ్డు పై వ్యాపారాల కారణంగా తగరపువలస జంక్షన్ లో నెలకొంటున్న ట్రాఫిక్ జామ్ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు వచ్చే నెల నుంచి అందుబాటులోకి రానున్న నేపథ్యంలో భీమిలి - తగరపువలస రోడ్డు కీలకం కానుందని, రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన మొదలు పెట్టాలన్నారు. అలాగే భీమిలి మెయిన్ రోడ్డు, నరసింహస్వామి ఆలయం రోడ్డు, బీచ్ రోడ్డు, గంట స్తంభం – బీచ్ రోడ్డు విస్తరణ ప్రతిపాదనల తక్షణమే కార్యరూపంలోకి తీసుకురావాలని చెప్పారు. భీమిలి అభివృద్ధి కోసం మంత్రి పి.నారాయణ, కమిషనర్ కేతన్ గార్గ్ లతో క్షేత్రస్థాయిలో పర్యటిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం. విజయ్ కుమార్, ఈఈ వెంకట వాసు, కూటమి నాయకులు గాడు చిన్ని కుమారి లక్ష్మి, తమ్మిన సూరిబాబు, దండి వెంకటేష్, గరే సదానంద, పరిమి భువనేశ్వరి, కొప్పల కృష్ణ, నీలాపు శంకర్ రెడ్డి, దొంతల సూర్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చెయ్యాలి

## ఏబీవీపీ డిమాండ్

**విశాఖపట్నం (జయ జయహే)**

ఆంధ్రప్రదేశ్ లో డీఎస్సీ 2025 ఉపాధ్యాయ పోస్టుల నియామకంలో అవకతవకలు జరిగాయి అన్న ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆంధ్రప్రదేశ్ శాఖ డిమాండ్ చేస్తుంది . గత పది రోజులుగా కొంతమంది డీఎస్సీ పరీక్ష వ్రాసిన అభ్యర్థులు తమకు ఉపాధ్యాయ పోస్టుల నియామకంలో అన్యాయం జరిగిందని, నియామకలలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించలేదని, మెరిట్ విద్యార్థుల కు అన్యాయం జరిగిందని ఆందోళన చేస్తున్న విషయంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి మరియు సంబంధిత అధికారులు కలిసి వివరణ ఇవ్వాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుంది. ఈ విషయం పై ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి యాగంటి వెంకట గోపి మాట్లాడుతూ గత వైఎస్ జగన్ నెత్రుత్వం లోని ప్రభుత్వం ఒక్క టీచర్ పోస్ట్ కూడా భర్తీ చేయలేదని దాదాపు 9 సంవత్సరాలు తర్వాత కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో



భారీగా చేపట్టిన 16వేల టీచర్ పోస్టులు భర్తీ తో నిరుద్యోగులు ఆనందపడుతున్న సమయంలో కొంతమంది డీఎస్సీ వ్రాసిన అభ్యర్థులు తమకు టీచర్ల నియామకంలో అన్యాయం జరిగిందని. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటల్లో 423 గాను 382 టీచర్లు భర్తీ నియామకాల్లో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించలేదని, మెరిట్ కి అన్యాయం జరిగిందని ఈ విషయంపై మేము కోర్టులో కేసులు వేసామని, రిజర్వేషన్లు పాటించలేదని జాతీయ ఎస్సీ,ఎస్టి కమిషన్ కు ఫిర్యాదు చేశామని ఆరోపిస్తూ ఆందోళనకు దిగడం గమనార్హం. దీనిపై నిజాలు నెగ్గు తేల్చాల్సిన బాధ్యత రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి ఎంతైనా ఉందని ఏబీవీపీ భావిస్తుంది . ఇదే సమయంలో ఎటువంటి రాజకీయాల వత్తిడులు, ప్రలోబాలకు తావు లేకుండా రాబోయే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో కూడా పారదర్శంగా వ్యవహరించే విధంగా ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయలో నియామకం పై వచ్చే ఆరోపణలును గురించి నిజాలను తెలుసుకునేందుకు గాను అవసరమైన పక్షంలో సింగిల్ జడ్జి జడ్జిచే న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటు చేసి అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుంది. అదే విధంగా విచారణలో తప్పు జరిగిందని తేలితే విద్యా శాఖ మంత్రి భాధ్యత వహించాలని కోరారు. అంతేకాకుండా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ఆరోపణలు చేస్తే, అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఈ సందర్బంగా డిమాండ్ చేస్తోంది.

# క్షేత్ర పర్యటనలో దక్షిణ కోస్తా రైల్వే జీఎం సందీప్

## తొలి రోజు విశాఖపట్నం - ఇచ్చాపురం విభాగ పరిశీలన ... జీఎం వెంట జోనల్, డివిజన్ అధికారులు








**విశాఖపట్నం, జూన్ 4, జయ జయహే**

దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తన తొలి తనిఖీలో భాగంగా నేడు విశాఖపట్నం - ఇచ్చాపురం రైల్వే విభాగాన్ని సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు, ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతా చర్యలు మరియు నిర్వహణ సామర్థ్యాన్ని సమీక్షించారు. ఈ తనిఖీ సింహాచలం రైల్వే స్టేషన్‌లో ప్రారంభమైంది. అక్కడ అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని శ్రీ సందీప్ మాథుర్ పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల మరియు స్టేషన్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపడుతున్న వివిధ పనులను ఆయన సమీక్షించారు. తనిఖీ సందర్భంగా జనరల్ మేనేజర్ కొత్తవలస, శ్రీకాకుళం రోడ్, నౌపడా, పలాస మరియు ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్లను కూడా సందర్శించారు. ఈ స్టేషన్లలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద కొనసాగుతున్న పునర్వికాస పనులు, ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతా చర్యలు మరియు నిర్వహణ మెరుగుదలలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. స్టేషన్‌ల సర్క్యులేటింగ్ ఏరియా, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, నిరీక్షణ మందిరాలు మరియు ఇతర ప్రయాణికుల సౌకర్యాలను ఆయన పరిశీలించారు. అలాగే సంబంధిత అధికారులతో సమావేశమై వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. పనుల నాణ్యతను నిరంతరం కాపాడుతూ, నిర్దేశిత గడువులోపు వాటిని పూర్తి చేయాల్సిన అవసరాన్ని జనరల్ మేనేజర్ నొక్కిచెప్పారు. అనంతరం జనరల్ మేనేజర్ ఇచ్ఛాపురం నుండి విశాఖపట్నం వరకు విండో ట్రైలింగ్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే పట్టాలు, సిగ్నలింగ్ వ్యవస్థలు, వంతెనలు, వంకర మార్గాలు (కర్వ్‌లు), రోడ్ ఓవర్ బ్రిడ్జిలు , స్టేషన్ యార్డులు మరియు ఇతర రైల్వే ఆస్తులను పరిశీలించారు. ముఖ్యంగా భద్రతా ప్రమాణాలు మరియు రైళ్ల సమర్థవంతమైన నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పర్యటన సందర్భంగా వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు మరియు మీడియా ప్రతినిధులు జనరల్ మేనేజర్‌ను కలిసి రైల్వేకు సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అవసరాలపై వినతిపత్రాలు సమర్పించారు. వారి సమస్యలు, సూచనలను సందీప్ మాథుర్ ఓర్పుతో ఆలకించి, సంబంధిత అంశాలను నిబంధనలు మరియు నిర్వహణ సాధ్యతకు అనుగుణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ తనిఖీలో దక్షిణ కోస్తా రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ బి.ఎస్.కె. రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజనీర్ ఓ.బి. సురేష్ కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ వినీత్ కుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్తా మరియు విశాఖపట్నం డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా పాల్గొన్నారు.

# మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత

## మెట్రో కమిషనర్ తేజ్ భరత్





**విశాఖపట్నం, జూన4, జయ జయహే**

మొక్కలను నాటడమనేది ఓ సామాజిక బాధ్యతగా ప్రతీ ఒక్కరూ భావించాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్ భరత్ అన్నారు. కైలాసగిరిపై ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని గురువారం విత్తన బంతులను వెదజల్లే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కైలాసగిరి తెలుగు మ్యూజియం సమీపంలో మొక్కలు నాటారు. త్రిశూల్ వద్ద కొండ పైనుంచి విత్తన బంతులను విసిరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ సూచనలతో పర్యావరణ పరిరక్షణ కోసం విత్తన బంతులను విసిరే కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. అలానే 70 శాతం ఆవు పేడ, 30 శాతం మట్టి, 3 దేశీయ అడవి జాతి విత్తనాలు వినియోగించి ఈ విత్తనాల బంతులు తయారు చేయడం జరిగిందని, ప్రధానంగా ఈ విత్తనాల బంతుల్లో రావి, మర్రి, జువ్వి, వేప,రేల, మారేడు, నేరేడు, అంకుడు, తురాయి, దిరిసెన, గంగరావి, కొంకుడు, చింత, సీమ చింత, శీతాఫలం, రామాఫలం, సపోటా, జామ, దానిమ్మ, నారింజ, పొగడ, పనస, దేవకాంచన, ఏనుగు గురివింద, గంగరావి, తెల్ల మద్ది, నల్ల మద్ది, బాదం, అడివి బాదం తదితర 70 రకాల విత్తనాలు వినియోగించి విత్తనాల బంతులు తయారు చేయడం జరిగిందన్నారు. వాతావరణ కాలుష్యంతో పర్యావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయని, తద్వార భూతాపం విపరీతంగా పెరిగి ప్రకృతి వైపరీత్యాలు తరచు సంభవిస్తున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు తక్షణం చర్యలు తీసుకోవల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు ఒక మొక్కను విధిగా నాటాలన్నారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో విరివిగా మొక్కలను పెంచడం కోసం తగిన ప్రణాళికలను రుపొందిస్తున్నామని, మరీ ముఖ్యంగా విశాఖను గ్రీన్ విశాఖగా మార్చుటమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమన్నారు. వివిధ వృక్షజాతులకు చెందిన విత్తనాలను మట్టితో చేసిన సుమారు 10000 బంతులను గ్రీన్ క్లైమేట్, విశాఖ వారి పర్యవేక్షణలో కైలాసగిరి కొండపై వెదజల్లడం జరిగిందన్నారు. పర్యావరణ పరిరక్షణలో తమవంతు బాధ్యతగా అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, కార్యదర్శి మురళీకృష్ణ , శిరీష,ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, సీఏఓ హరిప్రసాద్, పర్యవేక్షక ఇంజనీర్లు రాంబాబు, మధుసూదన రావు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది, గ్రీన్ క్లైమేట్ ఎన్జీఓ సమన్వయకర్తలు జె. రాజేశ్వరి, ఐ. కృష్ణ కుమారి, పి. మాలతి, పి.భాస్కర్ పాల్గొన్నారు.


# అరుదైన వ్యాధితో బాధపడుతున్న దిల్లేశ్వరి

## దాతల సహాయం కోసం పడిగాపులు

**శ్రీకాకుళం. (జయ జయహే)**

PhonePe
ACCEPTED HERE
Scan & Pay Using PhonePe App
NAYANA DILLIESWARI





సిస్టమిక్ లూపస్ ఎరిథెమాటోసస్ అనే అరుదైన వ్యాధితో, నగరంలో రెడ్డికవీధికి చెందిన నాయన.దిల్లేశ్వరి గత కొంతకాలంగా బాధపడుతుంది. విజయనగరానికి చెందిన కృష్ణతో గత కొన్ని సంవత్సరాల క్రితం వివాహం కాగా, 4 సంవత్సరాల కుమార్తె, 10 నెలల కుమారుడు కలిగి ఉన్నారు. భార్యకు అన్నీ తానై, సపర్యలు చెయ్యటానికి, ఉన్న చిరుద్యోగం కూడా వదులుకోవాల్సి వచ్చింది. దిల్లేశ్వరికు అత్యవసరం వైద్యం నిమిత్తం ఎన్నో వైద్యశాలలు తిరిగినా నయం కాకపోవటంతో ఇంటి వద్దనే ఉంటూ కాలం నెట్టుకొస్తున్నారు. భర్త కృష్ణ రావు, మీడియా తో మాట్లాడుతూ ఈ వ్యాధి కారణంగా దిల్లేశ్వరి చేతి వేళ్ళు, కాలి వేళ్లకు రక్త ప్రసరణ ఆగిపోవడంతో ముక్క ముక్కలుగా చేతి, కాళ్ళ వేళ్ళు తెగిపడుతున్నాయని, ఈ రక్త సరఫరా పూర్తిగా ఆగిపోతే, అది కణజాల మరణానికి దారితీస్తుందని కన్నీరుపెట్టుకున్నారు. దీనివల్ల ప్రభావితమైన వేళ్లు నీలం, ఊదా లేదా నలుపు రంగులోకి మారతాయని, చికిత్స చేయకుండా వదిలేస్తే, అది శారీరంలో అన్ని భాగాలకు వ్యాపించి ప్రాణాలు పోయే అవకాశాలు ఎక్కువని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు రక్తాన్ని పల్చబరిచే మందులు, రోగనిరోధక శక్తిని తగ్గించే మందులు, శస్త్రచికిత్సలో భాగముగా రక్త ప్రసరణను పునరుద్ధరించడానికి, లేదా చనిపోయిన కణజాలాన్ని తొలగించడానికి, మెరుగైన వైద్యం అవసరమని, ఆర్థిక స్థోమత లేకపోవడంతో మందులుతోనే జీవనం కొనసాగిస్తున్నామని, కనీసం మందులు కొనటానికి కూడా ఇబ్బందిపడుతున్నామని, సుమారు నెలకు రూ. 20 వేలు అవసరమని, దిల్లేశ్వరి, కృష్ణ అన్నారు. మా దీనస్థితిని అర్థం చేసుకొని, నా కుటుంబాన్ని ఆదుకోవాలని, మనసున్న దాతలు, అధికార ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు మమ్మల్ని ఆదుకోవాలన్నారు. దాతలు ఫోన్ పే ద్వారా సహాయం చేయాలనుకునేవారు (89198 97494) చరవాణిని సంప్రదించాలన్నారు.బ్యాంకు ఖాతా నెంబర్ : 110048540923, ఐఎఫ్ఎస్సి కోడ్ : CNRB0003119, బ్రాంచ్ : విజయనగరం.



# చిల్డ్రన్స్ హోమ్‌లో పుట్టినరోజు వేడుకలు

**తెనాలి (జయ జయహే) జూన్ 04**

గుంటూరు జిల్లా, తెనాలి మండలం కఠెవరం గ్రామం లో ఉన్న కార్తీక్ ఫౌండేషన్ చిల్డ్రన్స్ హోమ్ లో గురువారం దీపికా పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులు సహకారంతో చిన్న పిల్లలకు, అనాధ పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ ఫౌండేషన్ చిల్డ్రన్స్ హోమ్ నిర్వాహకులు మాట్లాడుతూ దీపికా పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం చేయడం జరిగిందని తెలిపారు పుట్టినరోజు వేడుక అనాధపిల్లల నడుమ జరిపించడం చాలా గొప్ప విషయమని దీపికా కు ఆశీస్సులు అందిస్తూ తల్లి తండ్రులకు కుటుంబ సభ్యులందరికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# పాట రూపంలో ఎస్పీబీ ఎప్పటికీ అభిమానుల గుండెల్లోనే: భట్టిప్రోలు

**భీమవరం (జయ జయహే )**

ఐదు దశాబ్దాలపాటు తన మధుర గాత్రంతో భారతీయ సంగీత లోకాన్ని ఏలిన గానగంధర్వులు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం అని అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి అధ్యక్షులు భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. తెలుగు సినీ సంగీత సామ్రాజ్యాధినేత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా ఆయనతో గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఆయనకు ఘన నివాళులర్పించారు. శోభన్ బాబు అభిమాని బొండా రాంబాబు మాట్లాడుతు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం శంకరాభరణం, సాగరసంగమం వంటి చిత్రాల్లో ఆయన పాడిన శాస్త్రీయ గీతాలు, మరెన్నో ప్రేమ, విరహ, విషాద గీతాలు నేటికీ శ్రోతలను అలరిస్తూనే ఉన్నాయన్నారు. తన అద్భుతమైన గాత్రంతో, నటనతో కోట్లాది మంది అభిమానుల గుండెల్లో ఆయన శాశ్వతంగా నిలిచిపోయారని ఘన నివాలర్పించారు.



# పరిశోధనలు నూతన ఆవిష్కరణలకు మార్గం కావాలి

## నూతన మార్గాలను అన్వేషించాలి

## సెయింట్ టెక్నాలజీస్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ మోహన రెడ్డి

**విశాఖపట్నం, జూన్ 4, జయ జయహే**

పరిశోధనలు నూతన ఆవిష్కరణలకు మార్గం చూపాలని సెయింట్ టెక్నాలజీస్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ బి.వి.ఆర్ మోహన రెడ్డి అన్నారు. గురువారం ఏయూలో జి.ఎం.ఆర్ ఆలుమ్ని సమావేశ మందిరంలో వర్సిటీ అధికారులు, డీన్‌లను ఉద్దేశించి ఆయన ప్రత్యేకంగా ప్రసంగం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఆర్థికంగా పరిపుష్టి కావాలని ఆకాక్షించారు. విదేశాలలో విశ్వవిద్యాలయాలను సొంత కార్పస్ ఫండ్‌లను కలిగి ఉంటాయన్నారు. ఏయూను ఆర్థికంగా బలోపేతం చేయడానికి నూతన మార్గాలను అన్వేషించాలన్నారు. దీనిలో భాగంగా రీసెర్చ్-డెవలప్‌మెంట్ రంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రీసెర్చ్ నుంచి అప్లికేషన్ దిశగా ప్రయాణం సాగాలని సూచించారు. నాణ్యవంతమైన పరిశోధనలు సంపదను సృష్టిస్తాయమన్నారు. ఆలుమ్ని, దాతలు, సి.ఎస్.ఆర్ నుంచి నిధులను సమీకరించడంపై దృష్టి సారించాలన్నారు. నిర్ధిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగితే ఆలుమ్ని పెద్దెత్తున సహకారం అందిస్తుందన్నారు. ఆలుమ్ని సహకారంతో వివిధ విశ్వవిద్యాలయాలలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావించారు. ప్రత్యేకంగా వివిధ ఫౌండేషన్‌లు, ఇనిస్టిట్యూషన్స్ నుంచి సైతం నిధులు సమీకరించడం సాధ్యమన్నారు. పరిశోధనకు నిధులు మంజూరు చేసే పలు ప్రభుత్వ సంస్థలు దేశంలో ప్రముఖ విశ్వవిద్యాలకులు పరిశోధన సంబంధంగా అందిస్తున్న నిధులకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఏయూలో ఏర్పాటవుతున్న బి.ఐ.ఆర్.ఏ.సి బయో నెస్ట్, ఆక్సిమిక్ లాబ్ ఎంఓయూ-ఏఐ హబ్ ఏర్పాటు, ఐఐటిఎం కార్ట్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ఏయూ సాధించడం, నిర్వహించడం పట్ల డాక్టర్ బి.వి.ఆర్ మోహన్ రెడ్డి అభినందనలు తెలిపారు. అనంతరం విశ్వవిద్యాలయం తరపున డాక్టర్ బి.వి.ఆర్ మోహన రెడ్డిని సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో ఆలుమ్ని అసోసియేషన్ అధ్యక్షులు కె.వి.వి రావు, ఏయూ రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, డాక్టర్ కుమార్ రాజ, ప్రిన్సిపాల్స్, డీన్‌లు తదితరులు పాల్గొన్నారు.

# తమిళ రాజకీయాల్లో విజయ్ ఎత్తులు!

తమిళనాడు రాజకీయాలు రసవత్తర మలుపులు తిరుగుతున్నాయి. మద్దతుల ఇచ్చిన అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు మళ్లీ పళనిస్వామి చెంతకు చేరారు. మేమంతా మీ వెంటే అని ప్రకటించారు. ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం మనలేదని డిఎంకె నేత స్టాలిన్ ఇప్పటికే శాపనార్థాలు పెట్టారు. ఈ స్థితిలో కాంగ్రెస, లెఫ్, ముస్లిం పార్టీల మద్దతు బొటాబొటిగా ఉంది. దీంతో మరో ఐదేళ్లపాటు లాక్కురావడం అంత సులభం కాదు. ఎందుకంటే ఐదారు సీట్ల మద్దతుతో వారి గొంతెమ్మ కోర్కెలు తీర్చడం సిఎం విజయ్‌కు తలనొప్పిగా పరిణమించవచ్చు. ఈ క్రమంలో సొంతగా బలం కోసం టివికె అధినేత, సిఎం కొత్త ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ద్రవిడ పార్టీలకు చెక్ పెట్టడంతో పాటు తమిళనాట పాతుకు పోయేందుకు రాజకీయంగా ఎత్తులు వేస్తున్నట్లు పరిస్థితులు తెలియచేస్తున్నాయి. చిల్లర పార్టీలతో కలిసి నడిచేకంటే సొంతగా బలం సమకూర్చుకోవడం ఉత్తమమని ఆయన భావనలో ఉన్నారు. అందుకే ఇటీవల అన్నాడిఎంకెకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి విజయ్ పంచన చేరారు. వారు ఉప ఎన్నికల్లో టివికె పార్టీ పక్షాన గెలిస్తే సొంతబలం పెరగవచ్చు. ఇలా సొంత బలం కోసం అవసరమైన ఇతర పార్టీల్లోని ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి గెలిపించుకోవాలన్న ఎత్తుగడలో సిఎం విజయ ఉన్నట్లు సమాచారం. ఓవైపు ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో అభిమానం పెంచుకోవడంతో పాటు, పార్టీ బలాన్ని పెంచుకునేలా టివికె చీఫ్ ఎత్తుడగులు సాగుతున్నాయి. అధికారంలో ఉంది మన ప్రభుత్వమే అని డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ పార్టీ కార్యకర్తలతో అన్నట్లు విస్తృత ప్రచారంలో ఉంది. మరో సందర్భంలో విజయ్ ప్రభుత్వం కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని ఆయనే వెల్లడించారు. ఈ మాటల్ని అనుసరించి.. టీవీకే ప్రభుత్వాన్ని తాను నియంత్రించేస్థాయిలో ఉన్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది టీవీకేకు మింగుడు పడటంలేదు. మరోవైపు అన్నాడీఎంకే చీలికల కారణంగా మద్దతుగా నిలిచిన 25 మందిలో కొందరు మంత్రి పదవుల్ని ఆశించినట్లు ప్రచారంలో ఉంది. మంత్రివర్గ విస్తరణలో వారికెలాంటి స్థానం లేకపోవడం, కాంగ్రెస్ లో ఇద్దరికి దక్కడంతో పాటు డీఎంకే కూటమిలోని ఐయూఎంఎల్, వీసీకేకు చెరొక మంత్రిపదవి ఇవ్వడంతో అన్నాడీఎంకే చీలిక శ్రేణులు అసంతృప్తిగా ఉన్నట్లు తేలింది. డీఎంకే అధిపత్యం తగ్గించే వ్యూహంలో.. అన్నాడీఎంకే చీలిక ఎమ్మెల్యేలు తమవైపు ఉండటాన్ని లాభంగా మలచుకోవాలని టీవీకే చూస్తోంది. తమ పార్టీలోకి రావాలంటే రాజీనామాలు చేయాలనే షరతు విధించినట్లు విశ్వసనీయంగా చెబుతున్నారు. ఇందులో భాగంగానే నలుగురు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. రాజీనామాలు చేసేందుకు మరికొందరు అన్నాడీఎంకే చీలికవర్గం ఎమ్మెల్యేలు



సిద్ధమవుతున్నట్లు సమాచారం. టీవీకేకు అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో.. ఆ పార్టీకి మద్దతిచ్చే పక్రియలో రెండు ప్రధాన కూటములు ఎవరి ఆట వారు ఆడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు విజయ్ కొత్త ఆట మొదలుపెట్టారు. పలువురు ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి విజిల్ గుర్తుపై బరిలోకి పంపి.. వారిని గెలిపించి.. ఇతర పార్టీల మద్దతు లేని సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీలో జరిగిన బల ప్రదర్శనలో టీవీకే ప్రభుత్వం అనూహ్య మద్దతు కూడగట్టుకుంది. ఏకంగా 144 ఎమ్మెల్యేల బలాన్ని అందుకుంది. ఈ సంఖ్యలోనే అనేక వ్యూహాలు కనిపిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీవీకేపై ఆధిపత్యం కోసం ఇటు డీఎంకే కూటమి, అటు అన్నాడీఎంకే ఓ వర్గం అంతర్గత వ్యూహాల్ని రచించినట్లు తెలుస్తోందంటున్నారు. అంతర్గత నిర్ణయాల కారణంగా తమ కూటమిలోని వీసీకే, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన 8 సీట్లను టీవీకే మద్దతుగా ఇచ్చారు. మరోవైపు టీవీకేతో జట్టుకట్టిన కాంగ్రెస్‌కు 5 సీట్లు, ఏఎంఎంకే నుంచి బయటికి వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా మద్దతిచ్చిన కామరాజ్ ఓటు కలిపి.. టీవీకేకు 119 సీట్ల వచ్చింది. కోర్టు ఆంక్షలతో తిరపత్తూర్ ఎమ్మెల్యే ఓటింగ్‌కు పాల్గొనలేదు, తిరుచ్చి తూర్పుస్థానం ఖాళీగా ఉండటం, స్పీకర్ ఓటు లెక్కలోకి లేకపోవడంతో టీవీకే బలం 105గా ఉంది. ఇతరుల మద్దతుతో ఓటింగ్‌కు ముందే మ్యాజిక్ ఫిగర్ దాటినట్లు అంచనాలు వచ్చాయి. ఇక అసెంబ్లీలో ఓటింగ్ జరుగుతున్న క్రమంలో అన్నాడీఎంకే చీలికవర్గం నుంచి అనూహ్యంగా మరో 25 ఓట్లు దక్కాయి. దీంతో బలం 144కు చేరింది. రెండు కూటముల నుంచి టీవీకేకు బలం అందడంతో వచ్చే 6నెలలదాకా ప్రభుత్వం కూలడానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిన్లటైంది. మద్దతు పార్టీల సంగతి అటుంచితే.. ఇప్పటికిప్పుడు టీవీకే నెమ్మదిగా బలపడుతోంది. సొంతంగా 107 స్థానాలు దగ్గరున్నాయి. 5 కాంగ్రెస్, ఒక స్వతంత్రతో పాటు ప్రస్తుతం ఖాళీగా ఉన్న 5 అసెంబ్లీ స్థానాల్లో గెలిస్తే.. 118 స్థానాల బలమొస్తుంది. అన్నాడీఎంకే చీలిక వర్గంలోని మరికొందరు రాజీనామాలకు సిద్ధపడి టీవీకే గుర్తుపై పోటీ చేసే అవకాశమొస్తే మ్యాజిక్ ఫిగర్ 118ని దాటి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకుల్లో చర్చ సాగుతోంది. తిరుచ్చి ఈస్ట్‌లో విజయ్‌కు 91,381 ఓట్లు వచ్చాయి. ఈయన డీఎంకేపై 27,416 ఓట్లతో గెలిచారు. ఇక్కడ అన్నాడీఎంకే చీలికవర్గ బలం తోడైతే అవలీలగా లక్ష ఓట్లు దాటొచ్చనేది అంచనా. రాజీనామాలు చేసిన స్థానాల్లో.. చెంగల్పట్టు జిల్లా మదురాంతకం(ఎస్సీ), తిరునెల్వేలి జిల్లా అంబాసముద్రం కలుపుకుని ఇప్పుడు తొలి 3 స్థానాల పార్టీలు టీవీకేవైపు ఉండటంతో ఇక్కడ లక్షన్నర ఓట్లకు తగ్గని బలముంది. 4 రాజీనామా స్థానాల్లో తిరిగి టీవీకే అభ్యర్థి గెలిచే అవకాశాలు సమృద్ధిగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇలా మరిన్ని స్థానాలు విజయ్‌కి తోడై అవలీలగా, ఒంటరిగా టీవీకే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, తద్వారా డీఎంకే ప్రభావాన్ని లేకుండా చేయడంతో పాటు స్వేచ్ఛగా పాలన అందించే దిశగా అడుగులు వేసే అవకాశాన్ని టీవీకే పరిశీలిస్తోంది. ఈ సమీకరణాలతో విజయ్ రాష్ట్రంలో మరింత బలపడాలని చూస్తున్నారు. అదే జరిగితే ద్రవిడ పార్టీలకు మనుగడ కష్టమే.



## అంబేద్కర్ భవన్... నవీన్ అకాడెమీ
# పేద నిరుద్యోగులకు వరం
### గ్రూప్ 2 కోచింగ్ ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యే కొండ్రు మురళి

**విశాఖపట్నం, జూన్ 4, జయ జయహే**

ఉత్తరాంధ్రా గ్రామీణ నిరుద్యోగ యువతకు అంబేద్కర్ భవన్ ఆశ్రయం...నవీన్ ఐఏఎస్ అకాడెమీ విద్యాబుద్ధులు నేర్పి సాన పెడితే మెరికల్లా తయారవుతారని మాజీ ఎమ్మెల్యే కొండ్రు మురళి అన్నారు. గురువారం రామాటాకీస్ దరి అంబేద్కర్ భవన్‌లో ఆయన గ్రూపు 2 కోచింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ భవన్, నవీన్ ఐఏఎస్ అకాడెమీలు సంయుక్తంగా ఈ అత్యున్నత కోర్సులు పేదల కోసం అందించడం అసాధారణమైన విషయమన్నారు. అంబేద్కర్ భవన్‌లో పేద విద్యార్థులను ఉన్నతాధికారులుగా తీర్చిదిద్దే గ్రూపు -1, 2 కోచింగ్‌ను ప్రారంభించడం ఉత్తరాంధ్ర పేదలకు శుభవార్తన్నారు. ఉత్తరాంధ్ర గ్రామీణ ప్రాంతాల్లో మెరికల్లాంటి విద్యార్థులున్నారని అలాంటి వారిని ఇలాంటి చోట్ల సాన పెడితే కేంద్ర రాష్ట్ర ఉద్యోగాల్లో ముత్యాల్లా రాణిస్తారన్నారు. నవీన్ ఐఏఎస్ అకాడెమీ ద్వారా ఇప్పటికే ఎంతో మంది ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని, అలాంటి మంచి సంస్థ ద్వారా అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ వారు కోచింగ్ ఇప్పించడం శుభ పరిణామమన్నారు. సక్సెస్ అనేది ఒక్క రోజులో అయ్యే అదృష్టం కాదని నిరంతరం పుస్తకాలతో కుస్తీ చేస్తేనే ప్రపంచం గర్వపడే అధికారులుగా ఎంపికవుతారని చెప్పారు. కలలతో పాటు వాటిని సాకారం చేసుకునే నిరంతర శ్రమ కూడా ఉండాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ మెమోరిల్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు కళ్యాణరావు, జేవీ ప్రభాకర్‌లు మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన కోచింగ్ ఇవ్వాలన్నదే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే నవీన్ ఐఏఎస్ అకాడెమీతో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలతో పాటు ఆర్థికంగా వెనకబడిన వారందరికీ ఈ కోచింగ్‌లో ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. నవీన్ అకాడెమీ డైరెక్టర్ పి. దివ్య కాంతిమై మాట్లాడుతూ 13 ఏళ్లుగా ఐఏఎస్ కోచింగ్ ఇవ్వడంలో తమ సంస్థకు అనుభవం ఉందన్నారు. తమ సంస్థ ద్వారా ఇప్పటికే వందలాది మంది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నత స్థానాల్లో అధికారులుగా ఉన్నారనడానికి గర్వపడుతున్నామన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు రాష్ట్ర గ్రూపు 1, 2 అధికారులే కాకుండా ఎసఎస్‌సీ, సీజీఎల్, తదితర పోటీపరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు అనేమ మంది ఉన్నట్టు వివరించారు. అంబేద్కర్ మెమోరిల్ సొసైటీ విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ డాక్టర్ గారా సత్యన్నారాయణ మాట్లాడుతూ పేద ఎస్సీ ఎస్టీ బీసీ ఓసీలకు దూరమవుతున్న ఖరీదైన కోచింగ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ కోచింగ్ ద్వారా భవిష్యత్తులో అనేక మంది గ్రూపు 1, 2 అధికారులయ్యే అవకాశం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ భవన్ కార్యవర్గ సభ్యులు, నవీన్ ఐఏఎస్ అకాడమీ ఫాకల్టీ , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 5, 6, 7 తేదీల్లో హైటెక్స్‌లో
# చేనేత వస్త్ర ప్రదర్శన

**జయ జయహే**




అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన పోచంపల్లి 'ఇక్కత్' వస్త్ర ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఈనెల 5,6,7 తేదీల్లో ప్రత్యేక వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. పోచంపల్లి చేనేత కళాకారుల జీవన ప్రమాణాల మెరుగుపరిచే లక్ష్యంతో జూన్ 5, 6, 7 తేదీల్లో హైదరాబాద్ హైటెక్స్ లో 'త్రెడ్ పోచంపల్లి' పేరిట వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచేందుకు ఏర్పాటు చేసే ఈ ఎగ్జిబిషన్ లో దాదాపు 100 పైగా స్టాల్స్, మహిళా శక్తి స్వయం సహాయక సంఘాల ద్వారా కూడా స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు.

# జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీలు
### నియమించిన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్

**జయ జయహే**



జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీలను ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ నియమించారు. జనసైనికుల నుంచే భవిష్యత్తు నాయకత్వాన్ని తీర్చిదిద్దే వినూత్న పక్రియకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని అధినేత చెప్పుకొచ్చారు. 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసే దిశగా కసరత్తు చేస్తున్నామని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. కేడర్ ఆధారిత నాయకత్వ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. క్షేత్రస్థాయి సమాచారాన్ని పరిశీలించి పార్టీ బాధ్యతల కేటాయింపుపై తుది నిర్ణయం తీసుకుంటామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# పుడమి తల్లి ఉగ్రరూపం చూడాలనుకోకు బాబూ...!
### తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఆవేదన

**విశాఖపట్నం, జూన్ 4, జయ జయహే**



పుడమి తల్లి ఉగ్రరూపాన్ని ఈ కూటమి ప్రభుత్వం చూసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో పాలక బిడ్డలు చేస్తోన్న అకృత్యాలు భరించలేక ఆవేదన చెందుతోందన్నారు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వ పెద్దలు చేస్తున్న అరాచకాలను నేల తల్లి తట్టుకోలేకపోతుంది ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఆయనేమన్నారంటే...భూమాతకు ఎందుకింత ఆవేదన. ఎందుకింత బాధ. ఏమిటీ కష్టం.. అన్నిటికీ ఒకటే సమాధానం గ్లోబల్ వార్మింగ్.. ఇప్పుడు మానవాళి మేలుకోవాల్సిన సమయం వచ్చింది. ఉపేక్షిస్తే ఆ తల్లి మహోగ్రరూపం దాలుస్తుంది. అప్పుడంతా ప్రళయమే..ఆ విలయాట్టహాసంలో మాడిమసవ్వాల్సిందే. మన కాళ్లకింద వెయ్యి టన్నుల న్యూక్లియర్ బాంబులున్నాయి. వందల కొద్ది హైడ్రోజన్ బాంబులున్నాయి. అవి ఏ క్షణంలోనైనా పేలవచ్చు. అదే జరిగితే భూమ్మీదున్న సమస్త జంతుజాలము చెట్లు చేమలు నాశనమవుతాయి. భూమి ఓ మరుభూమిగా మారిపోతుంది. నివాస యోగ్యంగా లేని గ్రహంగా మిగిలిపోతుంది. సూర్య కుటుంబంలోని మిగతా గ్రహాల్లా మారిపోతుంది. ఇది మండిపోతున్న ధరణి భవిష్యవాణి. మనం చేసే తప్పిదాలకు ప్రకృతి అప్పుడప్పుడు తన ఉగ్రరూపాన్ని చూపిస్తున్నా అదిచ్చే ప్రమాద సంకేతాలను గుర్తించలేకపోతున్నాం. అసలు భూమాతను పరిరక్షించుకోవాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలన్న ఆలోచన ఇప్పుడొచ్చిందేమీ కాదు. అర్ధశతాబ్దం కిందటే ఐక్య రాజ్యసమితి పర్యావరణ పరిరక్షణ కోసం నడుం బిగించింది.

# భవన నిర్మాణాలు, ఎల్ఆర్ఎస్ మంజూరులపై నిఘా
### విధుల నిర్వహణలో జాప్యం చేస్తే జాగ్రత్త
### అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు
### ప్రణాళికా అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరిక

**విశాఖపట్నం, జూన్ 4, జయ జయహే**



విశాఖ నగర పరిధిలో గల భవన నిర్మాణాల అనుమతులు, ఎల్ఆర్ఎస్, టి డి ఆర్ ల మంజూరులపై జాప్యం లేకుండా నిర్ణీత కాలంలో పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ,విధుల నిర్వహణలో జాప్యం కనబరిచినా, అవినీతికి పాల్పడినా శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పట్టణ ప్రణాధికా అధికారులకు ఆదేశించారు. గురువారం ఆయన చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకర రావు, ఇతర ప్లానింగ్ అధికారులతో కలిసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశం హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలు తమ భవనాలు నిర్మించుకునేందుకు అనుమతులు కోరుతూ జీవీఎంసీ కి పలు అర్జీలు పెట్టిఉన్నారని వాటిని సకాలంలో పరిష్కరించడంలో చాలా జాప్యం టౌన్ ప్లానింగ్ అధికారులు కనబరుస్తున్నారని ,రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా ఎల్ఆర్ఎస్ మంజూరు ప్రక్రియలో కూడా జాప్యం కనపరుస్తున్నారని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భవన నిర్మాణ అనుమతులు, ఎల్ఆర్ఎస్, టిడిఆర్ మంజూరుల ప్రక్రియలో ఎటువంటి అవినీతికి తావు లేకుండా అధికారులు పనిచేయాలని, అవినీతికి పాల్పడినట్లు తేలినా లేదా ప్రజల నుండి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ హెచ్చరించారు. విధుల నిర్వహణలో జాప్యం, నిర్లక్ష్యం, అవినీతి ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు." ఏపీ డి పి ఎం ఎస్ పోర్టల్ ద్వారా నమోదైన బిల్డింగ్ అప్లికేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి రెండు రోజులు కంటే ఎక్కువగా జాప్యం లేకుండా వెంటనే పై అధికారులకు పంపించి భవన నిర్మాణాల మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎల్ఆర్ఎస్ లను కూడా ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని, ప్రణాళిక అధికారులు, సర్వేయర్ల విధి నిర్వహణలో, లైసెన్సుడ్ టెక్నికల్ పర్సన్స్ అనుమతుల నమోదు ప్రక్రియలో కూడా జాప్యం, లోపాలు కనిపిస్తున్నాయని ఇకపై జాప్యానికి కనబరిస్తే సహించేది లేదని కమిషనర్ హెచ్చరిస్తూ పరిష్కార దిశగా ప్రణాళికయుతమైన చర్యలను వెంటనే చేపట్టాలని చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకర్ రావుకు కమిషనర్ ఆదేశించారు. ఈ సమీక్షలో సిటీ ప్లానర్ ధనుంజయ రెడ్డి, డిసిపిలు మధుసూదనరావు ,రామ్మోహన్, ఏసీపీలు తిరుపతిరావు, రామలింగేశ్వర రెడ్డి, ఝాన్సీ, లక్ష్మి సబ్బం శాస్త్రి, రామకృష్ణ, టిపివోలు, టీపీబివోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com